ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

డిసెంబరు 28, 2014

సాహస చంద్రుడు



పుస్తకాల పండుగలు

రెండోస్సారి

ఎంత గొప్ప స్టార్లైనా సరే! ఎప్పుడోకప్పుడు సినిమాల నుంచి బ్రేక్ తీసుకోవాల్సిందే. అయితే కొందరు తారలు మాత్రం ... సుదీర్ఘ విరామానంతరం తిరిగి నటించేందుకు ఉబలాటపడుతుంటారు. ఈ ఏడాది అలా రెండోసారి రంగ ప్రవేశం చేసి ... అభిమానులకు ఆశ్చర్యానందాలను పంచిన వారిలో ఐదుగురిని ప్రధానంగా ప్రస్తావించుకోవాలి. అమృతా సింగ్ చాలా సంవత్సరాల తర్వాత ‘2 స్టేట్స్’తో వెండితెరపై ప్రత్యక్షమైంది. పంజాబీ తల్లిగా ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు తన వంతు ప్రయత్నం చేసింది. 90ల్లో బాలీవుడ్‌ను ఏలిన నటి జూహీ చావ్లా...‘గులాబ్ గ్యాంగ్’తో తిరిగి తెరమీదకొచ్చింది. ‘కిల్ దిల్, హేపీ ఎండింగ్’ చిత్రాలతో పూర్తి స్థాయిలో రీఎంట్రీ ఇచ్చాడు గోవిందా. అవి రెండూ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టినప్పటికీ గోవిందా నటనకు మంచి మార్కులే పడ్డాయి. అక్షయ్ కుమార్ ‘హాలిడే’లోనూ గోవిందా అతిథి పాత్ర పోషించాడు. ‘హీరో, జగ్గ జోసూస్’ చిత్రాలతో 2015ల లోనూ దర్శనమివ్వనున్నాడు. ఇంద్ర కుమార్ ‘సూపర్ నాని’ చిత్రంతో రేఖ మరోసారి వెండితెర మీద మెరిసిందనుకోవాలి. ఆమె చేసిన ‘ఫితూర్’ వచ్చే సంవత్సరంలో విడుదల కానుంది. అనురాగ్ కాశ్యప్ ‘బోంబే వెల్వెట్’తో రవీనా టాండాన్ సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. నిజానికిది ఈ సంవత్సరమే రావాల్సి వున్నప్పటికీ... విడుదల తేదీని పై ఏడాదికి మార్చారు. ‘సాబ్’ చిత్రంలోనూ రవీనా మాంచి పాత్ర చేస్తోందని వినికిడి.

వీరికి గతంలో ఎంత మంచి హిట్లు వచ్చాయన్నది ఇప్పుడనవసరం. తాజాగా వయసుకు తగ్గ పాత్రలతో ప్రేక్షకులను ఎలా మెప్పిస్తారన్నదే ప్రధానం. ప్రస్తుతానికి వీరి సక్సెస్ సూత్రం అదే. ◆



జూహీ చావ్లా

రేఖ

గోవిందా

రవీనా టాండాన్

అమృతా సింగ్

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కోటి ఆశలతో...

◆ మనలో మాట

కాలగమనంలో మరో పొద్దు పొడుస్తోంది. కోటి ఆశలతో, క్రొంగొత్త కోరికలతో ప్రజానీకం కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్నారు. సమైక్య రాష్ట్ర విభజన తరువాత వస్తున్న తొలి ఏడాది ఇది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజానీకంలోనూ ఎన్నో ఆకాంక్షలు.

కొత్త ఏడాది ఆ స్వప్నాలు నిజం కావాలి. గత కాలంలో ఎగిసిన విద్వేష భావనలు ధ్వంసం కావాలి. సోదరభావం, సమతా లక్ష్యం తెలుగు ప్రజల్లో వికసించాలి.

గత కాలపు చేదు జ్ఞాపకాలకు శాశ్వత సమాధి కట్టి, నూతన లక్ష్యాలకు జలసిరులు పారించాలి. ఐక్యతా స్ఫూర్తికి కొత్త చిగుళ్లు వేయించాలి. కష్టాల్లో, కన్నీళ్లలో సుఖాల్లో, సంతోషాల్లో కలిసి కదలాలి.

కాగితాలకో, కొద్దిమందికో పరిమితమవుతున్న అభివృద్ధి ఫలాలు కష్టజీవుల పరం కావాలి. ఆకలి, నిరుద్యోగం సమసిపోవాలి. అన్నదాతల ఆత్మహత్యలు ఆగిపోవాలి. దేశపు వెన్నెముక నిజంగా నిటారుగా నిలవాలి.

మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, యాసిడ్‌దాడుల వికృత విన్యాసాలకు చరమగీతం పలకాలి. అన్ని రంగాల్లో సమాన హక్కులు సిద్ధించాలి.

ఆంక్షలు, పరిమితులు లేని విద్యావైద్యం అందరికీ అందాలి. ఏ దిక్కూలేని అభాగ్యులు, వృద్ధులకు ఆసరా ఇచ్చి, బతుకుపై భరోసా కల్పించే నూతన మార్గం ఆవిష్కృతం కావాలి.

పెట్టుబడిదారి విష సంస్కృతి, మతోన్మాద రక్కసితో కలిసి వేయి పడగలతో బుసకొడుతున్న సమయమిది. ఆ విష సర్పాన్ని మరింత పెంచి పోషించడానికే పాలకులు సిద్ధమవుతున్నారు. అవినీతి, స్వార్థం, లాభం పరమావధిగా సాగుతున్న ఈ ప్రక్రియ పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం మోపనుంది. మతంపేరుతోనూ, మరో పేరుతోనూ ప్రజలను చీల్చి పబ్బం గడుపుకోవడానికి పాలకవర్గాలు అమలు చేస్తున్న ఈ విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాలి. అంతరాలు, ఉన్మాదపు ఆవేశకావేశాలు లేని సమాజపు దిశలో అడుగులు వేయాలి. మన చిన్నారుల భవిష్యత్తుకు మనమే బాటలు వేసుకోవాలి. ఈ దిశలో తెలుగు ప్రజలు కొత్త అధ్యాయం సృష్టించాలి. పోరాట జెండాను ఐక్యంగా ఎగురవేయాలి. దేశానికి కొత్త దిశానిర్దేశం చూపాలి.

ఏ దేశ మేగినా, ఎందు కాలిడినా తెలుగు వెలుగు ఆదర్శం కావాలి. కొత్త సంవత్సరాన్ని సరికొత్త పుంతలు తొక్కించాలి.

■

టపా

ప్రేమ విప్లవం అందరూ చదవాలి

మార్క్స్ జెన్నీ ప్రేమ కథ అందరూ తప్పక చదవాలి. ఇది కుటుంబం ప్రేమ మాత్రమే కాదు. సామాజిక అంశం. జెన్నీ అనుభవించిన కష్టాలు, దుర్భర దారిద్ర్యం సమస్యలు, ఆనాటి సమాజానికి అద్దం పట్టింది. మార్క్స్ అండగా జెన్నీ ఉన్నందువల్లనే ఆయన తన రచనలను కొనసాగించారు. ప్రపంచ మేధావులలో అగ్రశ్రేణి మేధావి. ఆయన రాసిన దాస్ కాపిటల్ ప్రపంచ వ్యాపితంగా ప్రభావం చూపించింది. మార్క్స్, ఎంగెల్స్ మైత్రి ప్రపంచ మానవాళికి మార్గదర్శకం ప్రేమ విప్లవం సీరియల్ ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. పుస్తక రూపంలో వస్తే బాగుంటుంది. అనువాదం చాలా బాగుంది.

– టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

మనస్సును మెలిపెట్టింది

డిసెంబర్ 14వ తేది ఆదివారం సంచిక స్నేహలో పలు ఆసక్తికర అంశాలను తెలియచేశారు. ముఖ్యంగా ‘ అక్కడ చిన్నారులే ఛీఫ్ మినిస్టర్లు ’ చాలా బాగుంది. పెద్దలు విస్మరించిన సమస్యలను పిల్లలు బాల సభ ద్వారా చర్చించడం స్ఫూర్తి దాయకంగా అనిపించింది. చూద్దామాలో చైనాలోని చూడదగ్గ ప్రదేశాలు, వింతలు గురించి బౌద్ధాలయాలగురించి ఇచ్చారు. సమాచారం పాఠకుల్ని ఆకట్టుకునేవిధంగా ఉంది. ముఖ్యంగా లెషాన్ బ్రిడ్జి, బీజింగ్ ప్రత్యేకత గురించి, యాత్రికుల వసతిసౌకర్యాల గురించి చెప్పడం బాగుంది. ‘ అనాదిగా స్త్రీ ’ కవితలో పూరిగుడెసెల్లోనూ , ఏడంతస్తుల్లోనూ ఆడజన్మది కన్నీరే అన్నది సమాజంలో మహిళల స్థితిగతులకు అద్దంపడుతోంది. భూపాల్ గ్యాస్ దుర్ఘటనకు సంబంధించి ప్రముఖ ఫోటో జర్నలిస్టు రాహుల్ రాయ్ చెప్పిన విషయాలు చదువుతుంటే మనస్సంతా విషాదంతో నిండిపోయింది. మరీ మట్టిలోకూరుకుపోయిన చిన్నారి ఫోటో మనస్సును మెలిపెట్టింది. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో అవినీతి ఏ విధంగా ఉందో వివరించారు. మంచి సమాచారాన్నిచ్చారు. ప్రముఖ చిత్రకారుడు, దర్శకుడు బాపు చలన చిత్రాల గురించిన వ్యాసం ఆకట్టుకుంది. నేటి యువతను ఆకట్టుకుంటున్న సెల్ఫీల గురించి బాగా చెప్పారు. ఆ సరదా శృతి మించుతున్న తీరుతెన్నులను చెప్పారు. అయితే శృతి మించకుండా ఎం చేయాలో పూర్తి వివరాలిస్తే ఇంకా బాగుండేది. ప్రతి వారం వస్తున్న ప్రేమ విప్లవం సీరియల్ ద్వారా ఆసక్తి కరమైన విషయాలు తెలుసుకుంటున్నాము.

కె. రఘుబాబు, తిరుపతి

కంటతడి పెట్టించిన ఫోటో

డిసెంబరు 14 ఆదివారం అనుబంధం స్నేహలో ప్రచురించిన అక్కడ చిన్నారులే ఛీఫ్ మినిస్టర్లు లో బాలసభ ద్వారా చిన్న పిల్లలే సామాజిక సమస్యలపై గళం విప్పటం చాలా బాగా నచ్చింది. ఇలాంటి మంచి కథనాలు ఇంకా మరెన్నో తెలపాలని కోరుకుంటున్నాము. ప్రముఖ ఫోటో జర్నలిస్ట్ రాహుల్ రాయ్ భూపాల్ గ్యాస్ దుర్ఘటన సమయంలో మట్టిలో కూరుకుపోయిన పాప ఫోటో కంటతడిపెట్టిందింది. వింతలోకంలో మగవారికి పురుటి నొప్పులు రావడం కడుపుబ్బా నవ్వించింది. సినిమా కబుర్లు ద్వారా బాపు జయంతి రోజున స్నేహలో ప్రచురించిన ఆయన చిత్రాలు ఇప్పటికీ మరువలేము. బాల నేస్తాలు ద్వారా కొన్ని జంతువులతో ఇచ్చిన బొమ్మలు, పులిలో పాప, రంగులేద్దాం బొమ్మలు చాలా బాగున్నాయి. చివరి పేజిలో భవనాల మీద కళారూపాలు, అలాగే సౌర హంసలు, గుమ్మడి కాయలతో హంసలు చిత్రాలు ఆకట్టుకున్నాయి.

– అనుపోజు సంతోషి నాగరాజు, ఫూల్‌బాగ్ కాలనీ, విజయనగరం.

ఈ సంచికలో....

పుస్తకాల పండుగలు

కవర్‌స్టోరీ 14

అక్కడ ... అక్షరాలు మాట్లాడతాయి! పుస్తకాలు పలుకరిస్తాయి! అంతటితో ఆగుతాయా!? క్షేమ సమాచారాలు అడుగుతాయి. అంతేనా! మిత్రులకు... కొత్త కొత్త విశేషాలను అందించేందుకు అభిమానంగా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తాయి. ఎంతో ఆతృతతో, ఆశతో వచ్చిన పుస్తక ప్రేమికులకు విజ్ఞాన వీధుల్లో విహరింపజేస్తాయి ఒక్క మాటలో చెప్పకోవాలంటే అక్కడ... అడుగడుగున అక్షరాభిషేకమే! ప్రాంగణంలోకి అడుగెట్టిన ప్రతి ఒక్కరూ ఆ అక్షరాభిషేకంలో తడిసి ముద్దయిపోవాల్సిందే.

స్ఫూర్తి 3
పురుషులకున్న హక్కులన్నీ మహిళలకూ ఉంటాయి

చూద్దామా 4
గోపురమా నీ నీడ ఎక్కడమ్మా!

సినిమా కబుర్లు 5
వాటన్నిటి ముద్ర నా మీద వుంది

కథ 6
హుద్ హుద్

నివాళి 8
సాహస చంద్రుడు

విశేషాలు 10
బంగారం విశేషాలు...

నవ్వుల్ - పువ్వుల్ 11

సీరియల్ 18
ప్రేమ విప్లవం

సమ్‌థింగ్ స్పెషల్ 20
విస్తరిస్తున్న అమెరికా జైళ్ల పరిశ్రమ

రుచి 21
అరటితో అదుర్స్

బాలనేస్తాలు 22
జడబిళ్లల కోసం...

కొత్త పుస్తకాలు 24
అన్నీ నిజ జీవిత పాత్రలే



.... 12

◆ స్ఫూర్తి

పురుషులకున్న హక్కులన్నీ మహిళలకూ ఉంటాయి

బాక్సింగ్ రింగ్‌లోనే కాదు...నిజ జీవితంలోనూ ఎందరికో స్ఫూర్తినిస్తున్న క్రీడాకారిణి మేరీ కోమ్. ఇటీవల దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా క్రీడల్లో బంగారు పతకాన్ని సొంతం చేసుకుని తన సత్తాను మరోసారి ప్రపంచానికి చాటింది. రియోలో జరగనున్న 2016 ఒలింపిక్స్‌లో తల పడేందుకు దేశ రాజధానిలో శిక్షణ పొందుతోంది. తన వ్యక్తిగత ఆసక్తులు, ఆటల గురించి మేరీ ఇలా చెప్పుకొచ్చింది.

బాక్సింగ్‌ను ఎందుకు ఎంచుకున్నారు?

నాకు చిన్నప్పుడు ఆటలంటే చాలా ఇష్టం. మరీ ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ అంటే చాలా ఆసక్తి. బాక్సింగ్ పురుషాధిక్య క్రీడ. ఓ మహిళగా ఇందులో రాణించడం కష్టమే . మరీ ముఖ్యంగా తల్లినయ్యాక... పెద్ద సవాల్ అయ్యింది. ఇది ఆడవాళ్ల ఆట కాదంటూ... కొంతమంది మిత్రులు నన్ను నిరుత్సాహపరిచారు కూడా. కానీ మగవాళ్లు చేయగలిగింది ఆడవాళ్లు కూడా చెయ్యగలరని నా గట్టి నమ్మకం. నన్ను నేను నిరూపించుకున్నాక, పతకాలు గెల్చుకున్నాక కూడా ఇవాల్టికీ... ఎన్నో సవాళ్లు ఎదురౌతూనే వున్నాయి.

ముగ్గురు పిల్లలను (మొదటి ఇద్దరు కవలలు) ఎలా చూసుకుంటున్నారు?

సులభమే! నాకు ఆరోగ్య సమస్యలేం లేవు. ప్రసవ సమయంలో వెన్ను నొప్పి వచ్చింది. ఆ మధ్య ఓ చిన్న ఆపరేషన్ జరిగింది. అంతకు మినహా సమస్యలేం లేవు. కుటుంబంలో అందరూ సంతోషంగా వుండాలనుకుంటాను. పైగా నేను ఆరోగ్యంగా వుంటేనే ... సాధన బాగా చేయగలుగుతాను.

పిల్లల విషయంలో కఠినంగా వుంటారా?

కొన్ని సార్లు తప్పదు. కోపం ప్రదర్శించినా... మనసులో మాత్రం ప్రేమ వుంటుంది. నాకంటే వాళ్ల నాన్న మాటే బాగా వింటారు. వాళ్లేదైనా కొంటె పని చేసినప్పుడు కోపంగా చూస్తారంతే. కానీ అలా కోపంగా చూడ్డం కాదు. ఏదో ఒకటి చెప్పు అంటాను నేను.

మీ పిల్లలు ఎక్కువగా ఏం ఆడతారు?

అన్నీ. క్రికెట్, బాక్సింగ్, బాడ్మింటన్...! కానీ వాళ్లకు బొమ్మలు వేయడమంటే ఇష్టం. ఒక్కోసారి పొద్దున్నే లేచి పేపరు, పెన్సిళ్లు తీసుకుని బొమ్మలు వేస్తుంటారు. ఏమో! పెద్దయ్యాక మంచి చిత్రకారులు అవుతారేమో!

కొంత కాలం (2006-08) బ్రేక్ తీసుకున్నారు. రెండేళ్ల విశ్రాంతి తర్వాత రింగ్‌లో అడుగుపెట్టినప్పుడు ఎలా అనిపించింది ?

అదంతా మన మనస్సును బట్టి వుంటుంది. పైగా మనిషి మనిషికీ మారుతుంటుంది. పిల్లలు కలిగాక తిరిగి బాక్సింగ్ రింగ్‌లోకి రావాలనుకోవడంతో సవాల్ మరింత పెద్దదైంది. తిరిగి పోరాడాల్సి వచ్చింది. మన దేశంలో ... కోచ్‌లందరూ సహకరించరు కూడా. కొందరు మాత్రమే ప్రోత్సహించారు.

ప్రసవం తర్వాత బరువు ఎలా తగ్గారు?

గర్భిణిగా వున్నప్పుడు అన్నీ తినేశాను. ఒక్కోసారి ఎక్కువగా కూడా తిన్నానేమో! ముఖ్యంగా తీపి పదార్థాలంటే బాగా ఇష్టం. చోటా బీమ్ లడ్డూ. మా పిల్లలు వాటిని ఎప్పుడూ అడుగుతుంటారు. ఇంటి పనంతా చేసేదాన్ని. ప్రాక్టీస్ కూడా. 73 కేజీల బరువున్నాను. ప్రిన్స్ (మూడవ కొడుకు) నిద్ర పోయినప్పుడు నేనూ పడుకునేదాన్ని. అంతకుమించి ప్రత్యేకంగా ఏం చేయలేదు. ఇప్పుడు 56-57 కేజీలు వున్నాను.



భర్త, పిల్లలతో మేరీ

బాక్సింగ్ కాకుండా...ఇష్టమైనవి....

యాక్షన్ చిత్రాలంటే ఇష్టం. టీవీ సీరియల్స్ చూస్తాను. పోటీలకోసం విదేశాలు వెళ్లినప్పుడు... నాకిష్టమైన సీరియళ్లలో ఏం జరిగిందో తెల్సుకోవడానికి మిత్రులకు ఫోన్ చేస్తుంటాను. లతా మంగేష్కర్ నా అభిమాన గాయని. అప్పుడప్పుడు దిన్‌చాక్ సంగీతం కూడా వింటుంటాను.

2016 ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించడమే మీ తదుపరి లక్ష్యమా ?

అదే నా ప్రధాన లక్ష్యం.చివరి పోరాటంలో నా శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో కనబరచాలనుకుంటున్నా. ఆ తర్వాత నేను రిటైర్ కావొచ్చు. వయసును కూడా పరిగణనలోకి తీసుకోవాలి. శక్తిసామర్థ్యాలు తగినంతగా లేకుంటే కష్టం కదా. ఇప్పటికే వెన్ను నొప్పి, మోకాలి నొప్పి...వంటి చిన్న చిన్న సమస్యలున్నాయి. రిటైర్మెంట్ తర్వాత పూర్తి సమయాన్ని మణిపూర్‌లోని అకాడమీకోసం వెచ్చించాలనుకుంటున్నా.

యువతులకు మీరిచ్చే సలహా...

జీవితంలోని ప్రతి దశలోనూ మగవాళ్లకి వున్న హక్కులన్నీ మహిళలకూ వుంటాయి. మనల్ని మనం వారితో సమానంగా భావించాలి. మనకూ కలలుంటాయి. అయితే పెళ్లి తర్వాత ఆ కలలను సాకారం చేసుకోవడం కొంచెం కష్టమౌతుంది. పనిని ప్రేమిస్తే... పెళ్లయి...పిల్లలు కలిగాక కూడా ... ఆ మహిళ ఏ రంగంలోనైనా రాణించగలదు. అలా అనుకుంటేనే కొంతైనా మార్పును ఆశించగలం. ◆

◆ యాత్ర

గోపురమా నీ నీడ ఎక్కడమ్మా !

ఒక్కో ఆలయానికి ఒక్కో ప్రత్యేకత వుంటుంది. తంజావూరులోని బృహదీశ్వరాలయ గోపుర ప్రత్యేకత మాత్రం మరే దేవాలయానికి లేదనే చెప్పవచ్చు. ఎంత ఎండ కాస్తున్నా ఉదయం నుంచి సాయంకాలం వరకు ఏ వేళలోను బృహదీశ్వరాలయ గోపురం నీడ మాత్రం నేల మీద పడదు. ఈ వింతకు కారణమేమిటో... ఆనాటి వాస్తుశిల్పులు ఈ విశేషాన్ని ఎలా సాధించగలిగారో...ఇవాళ్టికీ కొరుకుడు పడడం లేదు.

తమిళనాడులోని తంజావూరు నగరంలో పది శతాబ్దాల క్రితం చోళరాజులు ఈ ఆలయాన్ని నిర్మించారు. బృహదీశ్వరాలయాన్ని చోళరాజులలో సుప్రసిద్ధుడయిన రాజరాజచోళుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ ఆలయాన్ని నిర్మింపచేశాడు. 1004వ సంవత్సరం నుంచి 1010వ సంవత్సరం వరకు ఆరు సంవత్సరాలపాటు అహోరాత్రాలు శ్రమించి నిర్మించిన ఈ దేవాలయం అపూర్వ శిల్పకళాశోభకు ఆలయం. బృహదీశ్వరాలయ ప్రాంగణంలో చెక్కిన నేటికీ కనువిందు చేస్తున్న అనేక శిలశాసనాల ద్వారా ఆనాటి రాజకీయ, ఆర్థిక సాంఘిక పరిస్థితులను తేటగా తెలుసుకొనవచ్చు. రాజరాజచోళుని వీరత్వం, ఆనాటి శిల్ప సంగీత, నృత్యాది కళావిశేషాలను శాసనాల వల్ల తెలుసుకోవచ్చు.

ఈ మహారాజు కాలంలో బృహదీశ్వరాలయ సమీపంలో ప్రత్యేకంగా రెండు వీధులను కళాకారులకే కేటాయించారు. దాదాపు 400 మంది సంగీత నృత్యశాస్త్రాలలో నిష్ణాతులైన కళాకారులు ఆ వీధులలో నివసించేవారట. ద్రావిడ వాస్తు పద్ధతిలో నిర్మించిన బృహదీశ్వరాలయం ఎన్నో విశిష్టతలకు ఆలవాలమైంది. ఈ దేవాలయ ప్రాంగణం 152 మీటర్లకు పైగా పొడుగుతో 76 మీటర్లకుపైగా వెడల్పుతో సువిశాలంగా వుంటుంది. ఆలయంలోని మూలవిరాట్ అయిన శివమూర్తి లింగాకారంలో 12 అడుగుల ఎత్తుతో శోభిల్లుతూ వుంటాడు. ఈ స్వామిని 'బృహదీశ్వరుడు' అని 'ఆడవల్లన్' అనీ వివిధ నామాలతో పిలుస్తూ వుంటారు.

గోపుర విశిష్టత

ఈ ఆలయగోపురాన్ని 216 అడుగుల ఎత్తుతో 14 అంతస్థులుగా అష్టభుజాకారంలో నిర్మించారు. ఈ గోపురం పైభాగాన 25 అడుగుల ఏకశిలా కలశం వుంది. ఈ శిలాకలశం బరువు 81 టన్నులకు పై మాటగానే వుంటుంది. బ్రహ్మాండమైన ఈ శిలాకలశాన్ని గోపురం మీద ప్రతిష్ఠించడం ఆనాడు పెద్ద సమస్యే అయ్యిందిట. ఆలయానికి 6 కిలోమీటర్ల దూరంలో వున్న సారాపల్లం అనే గ్రామం నుంచి ఆలయగోపురం ఎత్తువరకు ఏటవాలుగా ఇసుకతిన్నెలను ఏర్పరిచి ఆ మార్గం గుండా కలశాన్ని గోపురంమీదికి చేర్చారట. ఈ బృహత్కార్యం నిర్వహించటానికి కొన్ని వేలమంది పనివారు అవసరమయ్యారంటారు. ఏకశిలాకలశం రెండువైపులా రెండు అందమైన నంది విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ దర్శనమిస్తూ వుంటాయి. శిఖరం నీడ ఏ సమయంలోనూ నేలమీద పడనివిధంగా నిర్మించటం జరిగింది. గోపురానికి దక్షిణ దిక్కున గణేషుడు, బోళాశంకరుడు వగైరా శిల్పమూర్తులుండగా ఉత్తరదిక్కున వీరభద్రుడు, అర్ధనారీశ్వరుడు వగైరా కన్పిస్తాయి. తూర్పున నటరాజు అఖండనృత్యంలో మునిగిపోయి వుండగా పశ్చిమభాగాన హరిహరుడు, చంద్రశేఖరుడు... వున్నారు. వెరసి అపూర్వమైన కళాశోభతో విలసిల్లే ఈ మూర్తులన్నిటితో బృహదీశ్వరాలయ గోపురం కళలకు కాణాచిగా వెలిగిపోతూ వుంటుంది. ఈ గోపురాన్ని దక్షిణమేరుగా అభివర్ణిస్తుంటారు. కూడా. ◆

వాసికెక్కిన నంది

ఆలయ ప్రాంగణంలో గర్భగుడికి ఎదురుగా వున్న మండపంలో ప్రతిష్ఠించిన నందివిగ్రహం భారతదేశంలో వున్న రెండో పెద్ద నంది విగ్రహం. 12 అడుగుల ఎత్తుతో 19కి పైగా అడుగుల వెడల్పుతో వున్న ఈ బృహత్ నంది తన గంభీరమైన చూపులతో జీవకళతో ఉట్టిపడుతూ భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ వుంటుంది. ఈ మహానంది బరువు 25 టన్నులకు పై మాటగానే వుంటుంది. ఇన్ని విశిష్టతలు కలిగిన బృహదీశ్వరాలయం తర్వాత కాలంలో వచ్చిన రాజులను కూడా ఆకర్షించింది. 13వ శతాబ్దంలో తంజావూరును పాలించిన కొనేరినాయక్ అనే పాండ్యరాజు ఈ ఆలయ ప్రాంగణంలోనే అమ్మవారి ఆలయాన్ని కట్టించాడు. 17వ శతాబ్దంలో మరో రాజు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయాలన్నీ ఆనాటి పాలకుల కళాభిరుచిని తెలియజేస్తాయి. ఇక్కడ కొలువుదీరిన శిల్పాలన్నీ అద్భుతమైన కళా నైపుణ్యంతో తీర్చిదిద్దినవే.

వాటన్నిటి ముద్ర నా మీద వుంది



బాలీవుడ్ తెర మీద 'మిస్టర్ పర్ఫెక్ట్' ఎవరంటే వినవచ్చే పేరు ఆమీర్ ఖాన్. కేవలం తెర మీదేనా! నిజ జీవితంలో కూడా మిస్టర్ పర్ఫెక్టో కాదో తెలియాలంటే... భార్య కిరణ్, కుమారులు ఆజాద్, జునైద్ గురించి...సినిమాలు, వాటిలో తన పాత్రల గురించి ఆమీర్ ఖాన్ ఏమంటున్నాడో చూద్దాం.

ఆజాద్‌తో ఆడకుంటుంటే చాలా సంతోషంగా వుంటుంది. వాడు 'ధూమ్ 3' చూశాడు. 'పి.కె' కూడా చూడబోతున్నాడు. సినిమాల్లో నేనేం చేస్తున్నానో వాడికి తెలీదు. కానీ నా పాటలకు డాన్స్ చేస్తాడు. 'యే జవానీ హై దీవానీ' విడుదలైనప్పుడు ఆ సినిమా పాటలన్నిటికీ రోజూ డాన్స్ చేసేవాడు. 'ధూమ్ 3'లో నా 'ట్యాప్ డాన్స్'ను అనుకరించేవాడు. పిల్లల కోసం పెద్దగా సమయం వెచ్చించడంలేదని ఎప్పుడూ అనుకుంటూ వుంటాను. అయితే స్క్రిప్టు రాసుకోవడానికి ... కిరణ్ కొన్నాళ్ల కిందట హిమాచల్ ప్రదేశ్ వెళ్లాల్సి వచ్చింది. అదీ రెండు వారాల పాటు. మొదట వెనకాడింది తను. ఆజాద్‌ని విడిచిపెట్టలేకే. వాణ్ణి నేను చూసుకుంటానన్నాకే కదిలింది. ఆజాద్‌ను నిద్ర లేపడం, స్కూల్లో విడిచిపెట్టడం, తిరిగి తీసుకురావడం, ఇద్దరం కలిసి భోజనం చేయడం, వాణ్ణి నిద్ర పుచ్చడం...అన్నీ నేనే చేశాను. వాడు నిద్రలోకి జారుకున్నాక... మధ్యాహ్నం నా పని మొదలయ్యేది. తిరిగి మేల్కొనే లోపు నేను కొద్దిగా పని చేసుకునేవాణ్ణి. తర్వాత వాడితో ఆటలు సరిపోయేవి. ఇక...రాత్రి 9.30 తర్వాతే నా సమావేశాలు మొదలయ్యేవి. పని వేళలన్నీ వాడికనుగుణంగా మారాయి.

◆ మా పెద్దబ్బాయి జునైద్ కూడా 'పి.కె' సెట్ మీద వున్నందుకు చాలా సంతోషించేవాణ్ణి. జూనియర్ అసిస్టెంట్ కావడం వల్ల దూరంగా ఎక్కడో వుండి ... షూటింగ్ చూడ్డానికొచ్చిన జనాన్ని అదుపులో వుంచుతుండేవాడు తను. పైగా నాతో కాకుండా సినిమా యూనిట్‌తో పాటే వుండేవాడు. యూనిట్ ఎలా నడుస్తుందో స్వయంగా తెలుసుకోవడానికి ఇదో అవకాశం వాడికి. 'నటుడివి కావాలనుకుంటున్నావా?' అని నేనెప్పుడూ అడగలేదు. అందుకు సిద్ధంగా వున్నప్పుడు తనే చెప్తాడు.

◆ నా చిన్నతనంలో ... మా నాన్నకో, బాబాయికో స్క్రిప్టు వినిపించడానికి డైరెక్టర్స్ వస్తే... కూర్చుని వినేవాణ్ణి. ముందు ముందు సినిమాల్లో నటించాలన్న ఉద్దేశంతో కాదు. కథల పట్ల వున్న ఆసక్తి మేరకే అదంతా.

◆ కథ విన్నాక ఓ ప్రేక్షకుడి మాదిరిగా స్పందిస్తాను. అయితే నేను విభిన్నమైన పాత్రలను పోషించడానికే ఇష్టపడతాను. అయితే కథకే ప్రథమ ప్రాధాన్యత. కథ నచ్చితే చాలు. సినిమా అంతా నా చుట్టూ నడవాలనుకోను. 'ఒక సినిమా ద్వారా ఎంత డబ్బు సంపాదించుకోవచ్చు?' అని ఆలోచిస్తే మాత్రం నాలోని సృజనాత్మకతను చంపుకున్నట్టే. కాకపోతే చిత్ర పరిశ్రమలో చాలా మంది ఆ విధంగా వుండడం దురదృష్టకరం. ఇది సినిమాల్లోనూ చూపిస్తున్నాం. '3 ఇడియట్స్' ఇచ్చిన సందేశం అదే. 'విజయం వెనక పరిగెత్తొద్దు. విజ్ఞానం కోసం పరుగులు తియ్యి. అప్పుడు విజయం నిన్ను వెతుక్కుంటూ వస్తుంది' అని చెప్తుందా సినిమా. అయితే...దర్శకుడిని సంతృప్తి పరచగలుతున్నామా? ప్రేక్షకుడిని మనం ఆకట్టుకోగలుతున్నామా? అనేవే నేను ఎక్కువగా ఆలోచిస్తాను.

◆ నటుడు తన శరీరాన్ని ఓ సాధనంగా వాడుకోగలగాలి. పాత్రకు తగ్గట్టు శరీరాన్ని మలచుకోవడానికి నేనేమీ సిగ్గుపడను. ఇవాళ మగవాళ్ల శరీరాకృతులకు ప్రాధాన్యత బాగా పెరిగిపోయింది.

◆ 'పి.కె' పోస్టర్లన్నీ సినిమా చిత్రీకరణ సమయంలో తీసిన ఫొటోలతో చేసినవే. మంచి ఫొటోలుంటే పోస్టర్ ప్రచారం బాగా చెయ్యొచ్చని రాజుకు చెప్పాను. అందుకే ట్రైలర్ కంటే పోస్టర్ ప్రచారానికే ప్రాధాన్యత ఇచ్చాం. పరిశ్రమలో రాజు ఓ మంచి దర్శకుడని నా అభిప్రాయం.

◆ 'ధూమ్ 3', 'పి.కె' చిత్రాలు రెండూ ఒకేసారి తీశారు. ఆ రెండు పాత్రలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సి రావడం ... కష్టమైంది. ఒకేసారి రెండు పాత్రలు చేయాలన్న ఆలోచనే నాకు నచ్చదు. నిజానికి నేను ఒకేసారి రెండు కాదు (ధూమ్‌లో ద్విపాత్రాభినయం కనక) మూడు పాత్రలు చేసినట్టు. అందుకే 'పి.కె' కోసం ఎక్కువ రోజులు వెచ్చించి పని చేసిన వెంటనే ... సరాసరి స్విట్జర్లాండ్ వెళ్లాను. 'ధూమ్ 3' పతాక సన్నివేశ చిత్రీకరణ కోసం. సాహిర్ బ్రిడ్జి మీద నా పాత్రకు ఒక డైలాగ్ వుంది.... 'వక్త్ నహీ హై హమారే పాస్' అని. మొదటిసారిగా పూర్తి భోజ్‌పురి యాసలో 'వర్త్ నహీ హమ్రే పాస్' అని చెప్పాను. అదో అనుభవం.

కిరణ్, ఆజాద్‌తో

◆ నేను చేసిన పాత్రలన్నిటి ముద్ర నా మీద వుంటుంది. 'తలాష్'లో షెకావత్ పాత్రకు భావోద్వేగాలు చాలా ఎక్కువ. తన కుమారుణ్ణి పోగొట్టుకున్నాన్న భావం అతనిలో నిరంతరం వెంటాడేది. ప్రతి సన్నివేశంలోనూ పోగొట్టుకున్న భావనను, భారాన్ని పలికించాల్సి వచ్చేది. ఇక ప్రతి రోజూ నిద్ర లేవగానే నాకు బాగా సన్నిహితులెవరినైనా కోల్పోయినట్టు ఊహించుకునేవాణ్ణి. నిజ జీవితంలో కూడా కొంత వరకు ఆ పాత్రల్లా ప్రవర్తిస్తున్నాననిపిస్తుంటుంది.

◆ 2015లో ఏం చేస్తానో మరి!? ఇప్పటి వరకు స్క్రిప్టులు చదువుతూనే వున్నా. ఏదీ ఎంచుకోలేకపోయా. వచ్చే ఏడాది నా సినిమాలేవీ రాకపోవచ్చు.

◆ సల్మాన్, షారూక్‌తో కలిసి సినిమా చేయాలన్న ఆలోచనే ఉద్విగ్నంగా వుంది. ఈ విషయమై వారిద్దరితో మాట్లాడుతూనే వున్నా. మంచి కథ అందితే సంతోషంగా చేస్తా.

◆

◆ కథ

హుద్ హుద్

జయంతి పాపారావు,
8885421949

స్నేహాలు చాలా గొప్పవి. ఆత్మీయంగా ఉంటాయి. అనురాగంగా ఉంటాయి. ఆసరాగా ఉంటాయి. జీవితాలను నిర్మించేవిగా ఉంటాయి. కష్టసుఖాలను పంచుకునేవిగా ఉంటాయి. ఎవరితో చెప్పుకోలేనివి తమతో మనసువిప్పి చెప్పుకునేవిగా ఉంటాయి. అందుకే స్నేహాలు చాలా గొప్పవి.. చాలా చాలా గొప్పవి.

◆ ◆ ◆

హుద్ హుద్ తుఫాను. అక్టోబర్ 12, 2014 ఆదివారం. ఉదయం తొమ్మిదిన్నర నుండి మూడు గంటల వరకు భీకర తుఫాను ... ఆ తరువాత, మబ్బుల్లోంచి చిరు ఎండ. మధ్యాహ్నం మూడు నుండి రాత్రి పదకొండు గంటల వరకూ మళ్లీతుఫాను. భయంకరమైన గాలులు. విశాఖ విధ్వంసమైపోయింది. స్మశానం అయిపోయింది. విలయం... విధ్వంసం...చీకటి...భయం... ఆందోళన...దు:ఖం...విషాదం...రెండువందల డెబ్బైకిలోమీటర్ల వేగంలో వెయ్యి ఏనుగుల బలంతో పెను ప్రభంజనం.

ఇంటి కిటికీ అద్దాలు బద్దలైపోయాయి. కిటికీలు విరిగిపోయాయి. గుమ్మాలు, తలుపులూ పక్కకు ఒరిగిపోయాయి. ఇంట్లో అంతా పగిలిపోయిన గాజుముక్కలు, గాలితాకిడికి కొట్టుకొచ్చిన ఆకులు, చెత్త చెదారంతో ఇల్లంతానిండిపోయింది. కరెంటు లేదు. అంతా చీకటి. ఇంట్లోఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురయ్యాయి. టీవి, ఫ్రీజ్ వస్తువులన్నీ వాటి రూపురేఖలను పోగొట్టుకొని విగతజీవుల్లా మూలనపడ్డాయి. సెల్‌ఫోన్ మూగబోయింది. కరెంటు స్థంబాలు, సెల్‌టవర్స్ సైతం నేలకొరిగాయి. వరద నీటి తాకిడికి పురుగుపుట్ర మొత్తం ఇంట్లోకొస్తున్నాయి. దిక్కుతోచని స్థితి. ఉదయం నుండి తిండి, తిప్పలులేకుండా ..... పురుగుపుట్ర కుట్టకుండా, దుప్పట్లు కప్పుకొని బిక్కు బిక్కు మంటూ ఓమూల ముడుక్కున్నాం. తుఫాను తాకిడైతేనేం...చీకటైతేనేం...అవన్నీ కడుపుకుతెలియవు కదా! ఇక లాభంలేదని చీకటిని సైతం ఎదిరించి రంగంలోకి దిగింది నా శ్రీమతి, ఎలాగైనా నా ఆకలితీర్చాలని. స్టవ్ వెలిగిస్తుంటే గాలి ధాటికి ఆరిపోతుంది. బల్లలు, పీపాలు బిందెలు ఏది రక్షణగానిలుస్తుంది అంటే అవన్నీ అడ్డుపెట్టి పొయ్యి మీద నిప్పుకు దడి కట్టింది. ఆఖరికి నానా అగచాట్లు పడి నాలుగు మెతుకులు ఒండుకొని తిన్నాం. ఆ చీకట్లో మాకు టార్చిలైటే దిక్కు. ఏం జరిగినా ఎవరికీ చెప్పుకోలేని దుస్థితి. కేకలు వేసినా ఎవరూ బయటకు రారు. ఎవరి భయాలు వారివి. పాములు, తేళ్లూ ఇదే అదుననుకొని ఇంట్లోకి చొరబడుతున్నాయి. ఇక లాభం లేదనుకొని రెండు దుడ్డు కర్రలు చేత పట్టుకొని ఆ రాత్రంతా జాగారం చేశాం.

◆ ◆ ◆

తెల్లవారు జామున మూడు గంటలు దాటింది. నలుగురు వ్యక్తులు ఇంటి ముందు నిలబడి, మా ఇంట్లోకి టార్చ్ లైట్ వేశారు. మేం తుళ్లిపడి, ఒరిగి పోయిన ముందు ద్వారంలోంచి బయటకు చూశాం.

"ఒరేయ్, నారాయణా నేను రా ! భాస్కరాన్ని" అంటూ పిలిచాడు.

ఆ పిలుపు వినగానే నారాయణ మనస్సు కుదుటపడింది. తనతో వచ్చిన వారిని బయటే నిల్చోబెట్టి ఒరిగిన తలుపును పక్కకు తోసి ఇంట్లోకొచ్చాడు భాస్కరం.

" ఈ పరిస్థితిలో నీవు ఎందుకొచ్చావు రా " ఆశ్చర్యంగా అడిగాడు నారాయణ.

" నీ కోసం రాలేదు "

" మరి ..."

" విపత్తువల్ల ప్రజలు అల్లాడిపోతున్నారు. తిండి, నీరు లేక అలమటిస్తున్నారు. ఏదో నాకుతోచిన సాయం చేద్దామని వచ్చాను ".

"చాలా సంతోషం. ఏం చేస్తున్నావు"

"ఏముంది మా మిత్రులు, తెలిసిన వారు కొంత మంది కలిసి ఒక పరివారంగా కూడాము. బాధితులకు పులిహోర, పెరుగన్నం వంటి ఆహారపదార్థాలను తీసుకొచ్చి పంచుతున్నాం. మా శక్తిమేరకు తోచిన సహాయం చేస్తున్నాం "

"అన్నయ్య గారూ, మీరు చాలా గొప్పగా ఆలోచిస్తున్నారు. నిజంగా మీలాంటి వాళ్ల చాలా అరుదుగా ఉంటారు " అభినందించింది నారాయణ భార్య.

"చూడమ్మా, నాలో మంచితనాన్ని, మనిషిని తట్టిలేపింది నా నారాయణే. వాడే కనుక సరైన సమయంలో నాకు అండగా నిలబడకపోతే నా జీవితమే దుర్భరంగా మారిపోయేది."

"ఇప్పుడవన్నీ ఎందుకులేరా" అంటూ భాస్కరం మాటలకు అడ్డుతగిలాడు నారాయణ.

"గతం గుర్తొస్తోంది రా నారాయణా ! మాట్లాడకుండా ఉండలేకపోతున్నాను. ఇప్పుడే మన యూనివర్శిటి పరిస్థితి చూసొస్తున్నాను. కూలిన గోడలు, చెట్లు అవి చూస్తుంటే కడుపుతరుక్కుపోయింది. మన జ్ఞాపకాలన్నీ చెరిపేసింది ఈ తుఫాను. అన్నట్టు అక్కడ పరిసరాలు చూస్తుంటే నీవే గుర్తొచ్చావు. అయినా నీకెవరు చెబుతున్నారు. మా చెల్లెమ్మకు చెబుతున్నాను. చూడమ్మా వీడు ఎంత శాంతశీలో తెలుసా... చదువుకునే రోజుల్లో నేను దారితప్పాను. చదువును నిర్లక్ష్యంచేసి వ్యసనాల బారిన పడ్డాను. జీవితం అంటే జల్సాగా ఉండటమే అనుకునే ఊహలో బతికేస్తున్నాను. మా అమ్మానాన్నలు

కూడా నా చేష్టలు చూసి బాధపడేవారు. వీడు మారడు అంటూ నన్ను పట్టించుకోటమే మానేసారు. ఆ సమయంలో నన్నుసరైన మార్గంలో పెట్టడంకోసం నారాయణ ఎంతో ప్రయత్నించాడు. అవమానాలు పడ్డాడు. చివరికి వాడే గెలిచాడు. పదిమందికి సహాయపడటంలో ఉండే మాధుర్యాన్ని నాకు రుచి చూపించింది వీడే నమ్మా " అంటూ చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ ఒక్కసారి గాలి పీల్చి

"హ.. ఇక అవన్నీ తరవాత మాట్లాడుకుందాం కానీ, కూరగాయలు, వంట సరుకులు అన్నీ పదిరోజులకు సరిపడా పంపుతాను . మీరేం గాబరాపడకండి " అంటూ గబగబా వెళ్లిపోయాడు భాస్కరం.

చిన్న చిరు వెలుతురొస్తోంది. టైం ఐదుకావస్తోంది. నారాయణ భార్య ఇల్లంతా శుభ్రం చేసింది. ఇంటి ముందు చెట్లన్నీ కూలిపోయాయి. వాటిని ప్రక్కకు తొలగించే పనిలో పడ్డారు నారాయణ కాలనీవాళ్లంతా. కొంచెం పరిస్థితి సద్దుమణిగింది. వాతావరణం అలివికొచ్చింది. జనంలో అలజడి మొదలైంది. నిత్యావసరాల వేటలో పడ్డారు జనం. అసలు తుఫాను ఇప్పుడు మొదలైంది జనం గుండెల్లో. అరలీటరు పాలు తొంభైరూపాయలు. ఏ కూరగాయ కొనబోయినా కిలో 80 రూపాయలకు తక్కువ లేదు. చిన్న కొవ్వొత్తి యాభైరూపాయలు. ఎక్కడికి వెళ్లాలన్నా రెండువందలడుగుతున్నారు ఆటో, రిక్షావాళ్లు. బోరు వెల్ నుండి నీరు తోడటానికి మూడు వేలడుగుతున్నారు. మామోలు రోజుల్లో ఐదువందలు ఇస్తే కళ్లకద్దుకొని చేసేవారు. డబ్బుకు విలువ పెరిగిందా. తగ్గిందా. అర్థం కాని అయోమయం. కృత్రిమ కరువు సృష్టించారు. దళారులు పబ్బం గడుపుకుంటున్నారు. మరో పక్క ఇంటి గోడలు కూలి, అసలు ఇళ్లే పడిపోయి...ఆ అగచాట్లు మాటల్లో చెప్పలేము. అధికారులు, నాయకులు ఫోటోలకు ఫోజులివ్వడంలో పడిపోయారు. బాధితులకు అదిచేస్తున్నాం, ఇది చేస్తున్నాం అని వార్తాపత్రికల్లో పెద్దపెద్ద అక్షరాలతో రాయించుకుంటున్నారు. కానీ ఏ అధికారి, నాయకుడు బాధితులను పలకరించిన పాపాన పోలేదు. అయినా వారికి ఓట్లు కావాలి, అవి రాల్చే నోట్లు కావాలి. ప్రజల కన్నీళ్లు వారికెందుకు కనిపిస్తాయి. అధికారులను ఏం అనగలం. పాపం వారుకూడా రాజకీయ వ్యవస్థ చేతిలో కీలుబొమ్మలైపోయారు. ప్రభుత్వ యంత్రాంగంమొత్తం శిధిలమైపోయింది. ప్రజలు నిస్సహాయ స్థితిలో దిగులు...దిగులుగా ఉన్నారు.

భాస్కరం గారు పంపించారంటూ ఇద్దరు యువకులు వచ్చి కూరగాయలు, సరుకుల సంచి ఇంట్లో పెట్టారు.

"మేం కార్పెంట్ పనిచేస్తాం. తలుపులు, కిటికీలు బాగుచేయమని సార్ చెప్పారండి " అన్నాడు అందులో ఒకడు. కొలతలు అవి చూసుకున్నారు. వాళ్లకు కావాల్సిన మెటీరియల్ రాసుకున్నారు. అంతలో నారాయణ

"సుమారు ఎంత ఖర్చు అవుతుంది " అని అడిగాడు ఆ కుర్రాళ్లని.

"అవేవీ మీతో మాట్లాడద్దని చెప్పారండి, భాస్కరం గారు " అని చెప్పారు వారు.

"వాడు అలానే అంటాడులే. అది వాడి మంచితనం. నాలుగురోజుల్లో డబ్బు అందుతుంది. అప్పుడు రండి " అన్నాడు నారాయణ.

"మీకు ఈ చీటీ ఇవ్వమన్నారండీ, భాస్కరంగారు" అంటూ జేబులోని కాగితం తీసి నారాయణ చేతికిచ్చాడు ఓ కుర్రాడు. అందులో ఇలా రాసుంది ' అమ్మా, చెల్లెమ్మా, వాడికి మొహమాటమెక్కువ. బయట చూస్తే దోపిడీ. అన్నీ దోపిడీనే. నేను పరాయివాడ్ని కాదు కదా. ఏ అవసరమైనా అన్నయ్య ఉన్నాడని మర్చిపోవద్దు. వీళ్ల కార్పెంటర్లు. ముందు వీళ్ల చేత తలుపులు, కిటికీలు బాగుచేయించుకోండి. " ఇట్లు మీ అన్నయ్య. అంతలో నారాయణ భార్య వచ్చింది. భర్తను అడగకుండానే అతని చేతిలోని ఉత్తరం తీసుకొని చదివింది.

"ఈయన మాటలకేం కానీ అన్నయ్య చెప్పినట్లు చేయండి. పరిస్థితి చూస్తుంటే ఇంట్లో ఉన్నట్లు లేదు. వీధిలో ఉన్నట్టుంది " అంటూ రెండు చేతులతో భర్తను పొడిచి వాళ్లకు పని పురమాయించింది.

◆ ◆ ◆

పదిరోజులు గడిచాయి. ఎంత ప్రయత్నించినా మానసికంగా కోలుకోలేకపోయారు విశాఖ ప్రజలు. నారాయణ మనస్సు కూడా కకావికలమైంది. పంట చేలు ఏలా ఉన్నాయోననే ఆందోళన మొదలైంది నారాయణకు. విశాఖకు 70 కిలోమీటర్ల దూరంలోనున్న చిన్న గ్రామంలో అమ్మానాన్న ఇచ్చిన పొలం రెండెకరాలుంది. ఒక ఎకరంలో నీలగిరి మొక్కలు, మరో ఎకరంలో వరి పంట వేశాడు. పొలం చూసి నారాయణ గుండె తరుక్కుపోయింది. 3లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాడు. మొత్తం తుఫాను మింగేసింది. నారాయణే కాదు, చుట్టు పక్క రైతుల పరిస్థితీ ఘోరంగా ఉంది. వారి ముఖాన నెత్తుటి చుక్కలేదు. భారీ నష్టం. వార్తాపత్రికల్లో మాత్రం నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. అధికారులు వచ్చి పంట నష్టాన్ని అంచనా వేస్తారు. పాడైన చేలను ఫోటోలు తీసి తద్వారా నష్టపరిహారం అందిస్తారు అని బాకాలూదుతున్నారు. ఇంతవరకూ ఒక్కరు రాలేదు. స్థానిక నాయకులు అందరూ వ్యాపారాల్లో పడిపోయారు. పరిస్థితి అధ్వానం. అంతేలే ఆదుకుంటే వారు నాయకులెందుకవుతారు. అధికారులెందుకవుతారు ' అని మనసులో అనుకుని మదనపడ్డాడు నారాయణ.

◆ ◆ ◆

"చూశావా, నా మిత్రుడు భాస్కరం రాజకీయాలకు దూరంగా ఉంటాడు. తన శక్తిమేరకు ప్రజలకు నిస్వార్థంగా సేవచేస్తాడు. మారుమూల గ్రామలకు వెళ్లి పంచాయితీ అధికారులచేత పంట నష్టం రిపోర్టులను తయారు చేయించాడు. ఆ క్రమంలో ఎంతో మంది బాధితులను కలిసాడు. వారి పరిస్థితి కళ్లారా చూసొచ్చాడు. ఎంత మంచి మనస్సు వాడిది. అలాంటివాళ్లు సమాజానికి అవసరం " అని నారాయణ భార్యతో చెబుతుండగా ఇంటి ముందు జీపు ఆగిన శబ్దం వినపడింది. చూస్తే భాస్కరం.

"మీ గురించే మాట్లాడుకుంటున్నాం. అంతలో మీరే వచ్చారు అన్నయ్య. రండి " అంటూ నారాయణ భార్య స్వాగతం పలికింది భాస్కరానికి.

నారాయణ మాత్రం భాస్కరానికి ఎదురెళ్లి భుజంపై చేయివేసి లోపలకు తీసుకొచ్చాడు. భాస్కరం ముఖంలో విపరీతమైన అలసట కనపడుతోంది. కుర్చీలో కూర్చున్నాడు. నారాయణ భార్య కుశల ప్రశ్నలతో పాటూ కాఫీ అందించింది. తాగుతూ అసహనంగా " ఒరేయ్ నాకొక ప్రశ్న తలెత్తుతుంది. మన దేశం...కాదు భరతఖండం రెండువందల ఏళ్లకు పైగా తెల్లవారి పాలనలో ఎందుకు ఉందంటావు . వ్యాపార దోపిడీలు, వ్యాపార సంబంధాలు ఇవేగా మూలకారణం. సరే అది గడిచిన చరిత్ర. మరి ఇప్పుడు పరిస్థితుల గురించి మాట్లాడదాం. నిజంగా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందంటావా. విదేశీయుడు పోయాడు... వాడి స్థానంలో స్వదేశీయుడు వచ్చాడు. అంతేగా. ఛ..ఛ... ఎక్కడ చూసినా దోపిడీ. పేదవాడి నోటి కాడి కూడు లాగటమే ఈ వ్యాపారస్తులకు లాభం. ఇంత దౌర్భాగ్య స్థితి ...మన వ్యవస్థలను చూస్తుంటే నాకే సిగ్గేస్తుంది. ఎక్కడ చూసినా అవినీతి. దోపిడీ. ప్రకృతి వైపరీత్యంతో ప్రజలు అల్లాడుతుంటే ....వారి అవసరాలతో వ్యాపారం చేస్తున్నారు. పంటపోయి కరవు మిగిలిన రైతుల కష్టాలతో వ్యాపారం.. వ్యాపారం...వ్యాపారం... ప్రజల అవసరాలతో వ్యాపారం చేస్తున్న మన నాయకులు, మన వ్యవస్థను చూస్తుంటే నాకు ఏం చేయాలో తోచటం లేదు ".

"చూడు భాస్కరం, నీ ఆవేదన నాకర్థమయింది. బలహీనుడు మరింత బలహీనుడవుతున్నాడు. బలవంతుడు మరింత బలవంతుడవుతున్నాడు. ఆఖరికి మన కష్టాలను కూడా లాభాలుగా మలుచు కుంటున్నారు కొందరు నాయకులు, అధికారులు. మనకు అందవల్సిన నష్టపరిహారాల్ని పందికుక్కుల్లా మింగు తున్నారు. పైగా మేం ప్రజలకు అది చేస్తున్నాం. ఇదిచేస్తున్నాం అంటూ ప్రచారాలు చేసుకుంటున్నారు. మన చేయాల్సింది ఒక్కటే చైతన్యమవ్వడం. ప్రజల్లో చైతన్యం కలిగించడం. ప్రజల్లో చైతన్యం కలిగిననాడు ఈ వ్యవస్థ, ఈ వ్యవస్థను మోస్తున్న నాయకులు మొత్తం కట్టకలిసి ప్రజాగ్రహ తుఫానులో కొట్టుకుపోవాల్సిందే.

◆

◆ నివాళి

భిన్నమైన ఇతివృత్తాలను విభిన్న తరహాలో చిత్రించడం.. అందుకు తగిన నటీనటులను వెతికి పట్టుకోవడం, ఉత్తమాభినయం రాబట్టుకోవడం.. పొదుపుగా పొడుపుగా మాటలూ కట్టి పడేసే పాటలూ రాయించుకోవడం... ఇవన్నీ ఇమిడ్చిన కథను కథనం కొత్త పుంతలు తొక్కించడం ఇవన్నీ కె.బాలచందర్ ప్రత్యేకతలు. చెప్పాలంటే భారతీయ చలన చిత్ర రంగంలోనూ ప్రత్యేకించి దక్షిణాదిన ఆయనకే స్వంతమైన విశిష్టతలు. బాలచందర్ కేవలం ఒక దర్శకుడే కాదు, ఒక వరవడికి నిర్దేశకుడు. ఒక సంచలన కారుడు.

సాహస చంద్రుడు

బాలచందర్ ప్రభుత్వోద్యోగం చేసుకుంటూ కళల మీద ఆసక్తి కొద్ది నాటక రచనలు చేస్తూ ఆ విధంగా చిత్రాలవైపు ఆకర్షితుడైనాడు. నాటక రంగంలోనూ ఆయన పాత్రలపైనా సెట్టింగులపైనా ప్రయోగాలు చేసేవాడు. ఎంజిఆర్ చిత్రం దైవత్తాయల్ మాటల రచయితగా రంగ ప్రవేశం చేసినా కొద్ది కాలంలోనే దర్శకుడి అవతారమెత్తాడు. ఆయన రాసిన నాటకాలే మొదటి చిత్రాలుగా మారి తమిళ తెలుగు ప్రేక్షకులను అలరించాయి.

ఇది మల్లెల వేళయనీ...

మేజర్ చంద్రకాంత్ నాటకం సినిమాగా వచ్చి సౌందర రాజన్‌కు అదో శాశ్వత బిరుదుగా చేసింది. తెలుగులో ఎస్వీఆర్– వాణిశ్రీ– జయలలిత– హరనాథ్–చంద్రమోహన్ తదితరులతో నిర్మించిన ఈ చిత్రం వాణిశ్రీకి మరపురాని కథ తర్వాత గొప్ప పేరు తెచ్చింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన 'ఇది మల్లెల వేళయనీ' పాట ఇందులోదే. బాలచందర్ చిత్రాలన్నిటిలోనూ సంగీతానికి గొప్ప ప్రాధాన్యత వుంటుంది. మరోచిత్రం సర్వర్ సుందరం కూడా ఆయన నాటకం నుంచి పుట్టిందే. నగేష్‌ను నాయకుడుగా దక్షిణాది భాషల్లోనూ (మొహమూద్‌తో హిందీలో మై సుందర్ హూ) తీశారు. బాలచందర్ తొలుతగా తెలుగులో తీసింది మామూలు సినిమాలే అయినా 'బొమ్మా బొరుసా' బాగా విజయవంతమై వినోదం పంచింది. తర్వాతి కాలంలో వచ్చిన డజన్లకొద్ది వచ్చిన అత్తా అల్లుళ్ల పోటీ కథలకు అది నమూనాగా నిలిచింది.

అంతులేని వ్యథ!

బాలచందర్‌ను తెలుగువాళ్లకు బాగా దగ్గర చేసిన చిత్రం 'అంతులేని కథ'. తండ్రి సన్యాసుల్లో కలసి పోతే అన్న తాగుబోతు అన్న (రజనీకాంత్) వీధినబడితే ఇంటి భారం నెత్తిన వేసుకున్న పెద్దమ్మాయి సరితగా జయప్రదను కొత్త కోణంలో చూపించిన చిత్రం. పద్ధతిగా ఉద్యోగం చేస్తూ అందరి అవసరాలు గమనిస్తూ అదుపాజ్ఞలు పాటించే జయప్రద పాత్రకు పూర్తి భిన్నమైన ఫటాఫట్ జయలక్ష్మి (ఈ చిత్రంతోనే ఆమెకా పేరొచ్చింది) ఆమె తల్లి వంటి పాత్రలతో అంతులేని కథ ప్రేక్షకులకు ఒక బరువైన అనుభూతిని మిగులుస్తుంది. ఖచ్చితంగా వున్నందుకు నిందలు భరిస్తూ నియంత అనిపించుకుంటూ దాన్నుంచి బయిటపడేందుకు పరితపిస్తూ చివరకు మరింత కూరుకుపోయే 'అంతులేని కథ'లో అనేక మలుపులు, కుదుపులూ... ఈ చిత్రంలో నూతన నటుడు నారాయణరావుతో మిమిక్రీ పాట 'తాళి కట్టు శుభవేళ' ఒక ప్రత్యేకత. ఇలా అన్ని ప్రక్రియలకూ ఆయన చోటు కల్పించేవారు.

నారీ స్వరం.. ధిక్కారం

బాలచందర్ చిత్రాల్లో స్త్రీ పాత్రలు ఆత్మగౌరవం తొణకిసలాడేవిగా వుంటాయి. అదే సమయంలో తాతలనాటి నీతులను పురుషాధిక్య సమాజ రీతులనూ సవాలు చేస్తుంటాయి. కొన్నిసార్లు నైతిక విలువలను తారుమారు చేస్తుంటాయి. సినిమా రంగంలో పాతుకు పోయిన మూసను ఛేదించి ఆయన సాహసోపేతమైన సామాజికాంశాలను ఎంచుకున్నాడు. మొదటి చిత్రం అరంగేట్రం (తెలుగులో జీవితరంగం)లో బ్రాహ్మణ కుటుంబంలో పెద్దమ్మాయి అందరినీ పోషించడం కోసం వ్యభిచారిణిగా మారుతుంది. అపూర్వ రాగంగళ్ (తెలుగులో దాసరి పునర్నిర్మించిన తూర్పు పడమర)లో కూతురు (మాధవి తొలి పరిచయం) ఒక పెద్దాయన (సత్యనారాయణ) పట్ల ఆకర్షితురాలైతే ఆయన కుమారుడు (నరసింహరాజు) ఆమె తల్లి (శ్రీవిద్య)ను చేసుకోవాలనుకుంటాడు. ఇలాంటి కథలను ఆయన తప్ప మరెవరూ తీసుకునేవారు కాదు. 'ఆడాళ్లూ మీకు జోహార్లు' అనే చిత్రంలో హీరో కృష్ణం రాజుతో ముగ్గురు మహిళలు (జయసుధ, వై.విజయ, మాధవి) ముడిపడిన తీరును చూపిస్తాడు. 'ఇది కథ కాదు'లో జయసుధను అప్పుడప్పుడే పైకి వస్తున్న జయసుధను భర్త (అప్పుడప్పుడే పైకి వస్తున్న చిరంజీవి) హింసకు గురైన పాత్రలో చూపిస్తారు. ఆమెను ప్రేమించి ఆదుకోవాలనుకునే హీరో (కమల్ హాసన్)తో వెంట్రిలాక్విజం ప్రక్రియ ప్రేక్షకులకు పరిచయం చేయిస్తాడు దర్శకుడు. ఈ చిత్రంలో నాయిక అత్తగారు కొడుకును ధిక్కరించి కోడలు మనవడి దగ్గర వుండి పోతుంది. 'గుప్పెడు మనసు'లో రచయిత్రి (సుజాత) భర్త చేరదీసిన అమ్మాయి (సరిత)పైనే తాగిన మైకంలో అత్యాచారం

చేస్తాడు. దాని పర్యవసానాలేమిటి తప్పు చేయని ఆమెను ప్రేమగా చూడటం ద్వారా రచయిత్రి సంస్కారం ప్రదర్శిస్తుంది.(అయితే ఈ చిత్రం ముగింపులో అమ్మాయి ఆత్మహత్య చేసుకోవడం బాలచందర్ తరహా అనిపించదు. అంతు లేని కథలో ఫటా ఫట్ జయలక్ష్మి కూడా అంతే) మౌనమె నీ భాష ఓ మూగమనసా అని ఈ చిత్రంలో బాలమురళీ కృష్ణతో పాడించిన పాట ఒక క్లాసిక్. ఈ విధంగా బాలచందర్ చిత్రాలలో మానసిక ఘర్షణలకు నైతిక ద్వంద్వత్వాలను ప్రశ్నించడం చూస్తాం.

గండి కొట్టిన గడసరి

ఆయన కమల్ హాసన్, రజనీకాంత్, ప్రకాశ్ రాజ్, సరిత వంటి 48 మంది ప్రసిద్ధులను పరిచయం చేశాడని చెప్పుకుంటాం. ఇందుకు కారణం పాత్రోచిత నటుల కోసం ఆయన పడే తాపత్రయమే. ఎ.ఆర్.రహ్మాన్ వంటి సంగీత బ్రహ్మను కూడా పరిచయం చేయడంలోనూ అదే కనిపిస్తుంది. ప్రతిభను వెతికిపట్టుకోవడం ఉపయోగ పెట్టుకోవడం ఆయనకే చెల్లింది. తప్పటడుగులు వేస్తున్న తారలను ప్రసిద్ధులను చేస్తే వారికి సినిమాల పేర్లే ఇంటి పేర్లుగా నిలిచిపోయిన ఉదాహరణలు మరెన్నో.

మొత్తం మీద దర్శకుడి ప్రక్రియగా చెప్పే సినిమా రంగంలో నాయకుల ప్రాబల్యానికి గండి కొట్టిన గడసరి ఆయన. శివాజీ గణేషన్‌ను మినహాయిస్తే ఆయన ఏ అగ్రనటుడితోనూ సినిమాలు తీయలేదు. ఎం.జి.ఆర్, శివాజీ వంటివారు తమిళ సినిమాను ఏలుతున్న సమయంలో దర్శకుడుగా తన పేరు చూసి ప్రేక్షకులు వచ్చేట్టు చేసుకున్న ఘనత ఆయనకే దక్కింది. తెలుగులో దాసరి నారాయణరావు కూడా కొంత వరకూ అలాంటి ప్రభావం చూపించాడు గాని కొద్ది సంవత్సరాల్లోనే అగ్రనటులతో ఫార్ములా చిత్రాలవైపు మొగ్గాడు.

మరో చరిత్ర!

అది నిజంగా మరో చరిత్రే. తెలుగు అమ్మాయి తమిళ అబ్బాయి మధ్య నడిచిన ప్రేమకథతో జాతీయ సమైక్యతా సందేశం ఇచ్చాడు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పైలాన్‌ను సంకేతంగా వాడుకున్న వ్యక్తి ఆయన. బొమ్మరిల్లులో కూడా విజయవాడ నాగార్జున సాగర్ వంటివి చూపించారు. ఆయన చిత్రాలన్నిటిలోనూ ఈ లక్షణం వుంటుంది. 'మరో చరిత్ర' ఒక విధంగా యువతరం ప్రేమకథ మరో విధంగా సందేశాత్మక సంఘర్షణ. ఆ రోజుల్లో అది రికార్డులు బద్దలు కొట్టింది. ఏక్ దూజే కేలియే పేరిట హిందీలో నిర్మిస్తే అక్కడా అదరగొట్టింది. ఈ చిత్రంలో తమిళ మాటలు కలిపిన పాట గాని, కేవలం సినిమాల పేర్లతో పాడే పాట గాని అప్పట్లో పెద్ద క్రేజ్.



కమల్, రజనీతో బాలచందర్

పరిచ్యుతులు..బహిష్కృతులు

60,70లలో సంచలనాలు అంటే కొంతమంది కేవలం దొంగలు వ్యభిచారిణులు నీతి తప్పిన వారిని చూపించే ధోరణి వుండేది. అది కొంత బాలచందర్‌లోనూ కనిపిస్తుంది. అయితే ఆయన దాన్ని ఏనాడూ అసభ్యతకు వాడుకోలేదు. భారతీయ సినిమాలు ప్రతిష్టించిన పతివ్రత నమూనాను తోసిపుచ్చి స్వంత భావాలు గల మహిళలను ఆయన సృష్టించాడు. ఆ చిత్రాల్లో స్త్రీలైనా పురుషులైనా దారి తప్పారనుంటే అందుకు కారణమైన పరిస్థితులను కూడా వాస్తవికంగా చూపించే ప్రయత్నం చేశారు. ఇదో చరిత్ర పేరిట విడుదలైన ఆయన డబ్బింగ్ చిత్రం అచ్చంగా వేశ్యల సమస్యనే చూపిస్తుంది. ఇంతకు ముందు చెప్పుకున్నట్టు దర్శకుడుగా ఆయన తొలిచిత్రం అరంగేట్రం కూడా అదే సమస్యను మరో కోణంలో చూపించింది.

సాపాటు ఎటూ లేదు!

మరో చరిత్ర తర్వాత బాలచందర్‌ను తెలుగువారికి బాగా దగ్గర చేసిన చిత్రం'ఆకలి రాజ్యం' 70లలో ప్రధాన సమస్యగా వున్న నిరుద్యోగాన్ని ఆకలి బాధను కథాంశంగా తీసుకుని ఆ చిత్రం రూపొందించారు. శ్రీదేవి మేకప్ లేకుండా నటించగా కమల్ హాసన్ ప్రతాప్ పోతన్ తదితరులు ఇతర పాత్రల్లో కనిపించారు. 'సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్...' అనే ఆత్రేయ పాట ఆ చిత్రంలో గొప్ప హిట్.

మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని చిత్రం పొడుగునా హీరో ఉటంకిస్తుండటం ఈ చిత్ర ప్రత్యేకత.(తమిళంలో సుబ్రహ్మణ్య భారతిని తీసుకున్నారు) తెలుగు సినిమాలలో ఎన్నో గొప్ప పాటలు రాయడమే గాక చిత్ర పరిశ్రమతో పెనవేసుకుపోయిన శ్రీశ్రీని మహాకవిగా తెలుగు వారెవరూ చూపింది లేదు. ఆ ఘనత బాలచందర్ దక్కించుకోవడం నిజంగా విశేషం. చివరకు కూటి కోసం కూలి కోసం అన్న ఆయన బాటసారి గీతంతో ఈ చిత్రం ముగుస్తుంది.

తన్నీర్... తన్నీర్...

నీటి సమస్యను చిత్రించిన ఈ చిత్రం రాజకీయమైంది. స్థానికుల నీటి సమస్యను పరిష్కరిస్తానని ఓట్లు వేయించుకున్న హీరో పార్టీ ఫిరాయించి ఆ సమస్యను మర్చిపోతాడు. హీరోయిన్(సరిత) ప్రజలను సమీకరించి ఆయనకు బుద్ధి చెప్పడం ఇతివృత్తం. చాలా సహజంగా ఎలాంటి ఆర్భాటాలు లేకుండా కథ ప్రధానంగా నడిచే చిత్రం ఇది. సంగీతం ప్రజలదేనని చెబుతూ చిరంజీవి జెమినీ గణేషన్‌లతో తీసిన రుద్రవీణ జాతీయ అవార్డు పొందింది గాని నిజానికి బాలచందర్ ప్రత్యేకత పెద్దగా వున్న చిత్రం కాదు.

మేఘ సందేశం.. సింధుభైరవి

దాసరి తీసిన మేఘ సందేశం ఆయనకు బాగా నచ్చింది. ఆ కథనే ఆధారం చేసుకుని కొన్ని మార్పులతో 'సింధుభైరవి' తీశారు. దాసరి కథలో వున్న అస్పష్టతలను తొలగించి సూటిగానే చెప్పదల్చుకుంది చెప్పాడు. వివాహితుడైన ఒక కళాకారుడి జీవితంలోకి మరొకరు ప్రవేశించడం వల్ల కలిగే పర్యవసానాలను హృద్యంగా చిత్రించాడు. హీరోను ఎంతమాత్రం గొప్ప చేయకుండా ఇద్దరు మహిళలను మాత్రం మానవీయ కోణంలో చూపించడంలో బాలచందర్ ముద్ర ప్రస్ఫుటమవుతుంది. ఈ చిత్రం జాతీయ అవార్డులు తెచ్చిపెట్టింది. 47 రోజులు చిత్రం పెళ్లి చేసుకుని పారిస్ తీసుకుపోయిన వరుడు అమ్మాయిని మోసం చేసి హింసిస్తే ఎలా బయటపడిందన్న ఇతివృత్తంతో సాగుతుంది.ఇప్పుడు వెనక్కు తిరిగి చూస్తే ఆ కథను ముప్పై ఏళ్ల కిందటే ఎంచుకోవడంలో ఆయన పరిశీలనా శక్తి విదితమవుతుంది. ఆయన ప్రతి చిత్రానికి ఎంతో అధ్యయనం చేసేవాడు. ఏ విషయంలోనూ రాజీ పడటం తెలియని మనిషి. నూరవ చిత్రం 'పరవశం' ఈ శీర్షికలో శ్లేష బాలచందర్‌ను పట్టి చూపిస్తుంది. అయితే ఇది పెద్దగా విజయవంతం కాలేదు.

వైవిధ్య వైభవం

90వ దశకం తర్వాత ఆయన టీవీలలో సీరియల్స్ రూపొందిస్తూ వచ్చారు. తను సృష్టించిన కొన్ని పాత్రలు ధరించి చూపించారు కూడా. 'మర్మదేశం' అనేది చాలా సస్పెన్స్‌తో సాగి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగుతో పోలిస్తే తమిళంలో చిత్రీకరణ రీతులు ఇతివృత్తాలు కొంత విభిన్నంగా వుంటాయంటే దాని వెనక ప్రధాన ప్రభావం ఆయనదే. ఆఖరి వరకూ కూడా కళ పట్ల ఆసక్తినీ అంకితభావాన్నీ వదులుకోని ఆ అగ్ర దర్శకుడి మృతితో చిత్రరంగం ఒక మూల స్తంభాన్ని పోగొట్టుకుంది.

- పీ పీ

◆ విశేషాలు

బంగారం విశేషాలు

క్రీస్తుపూర్వం 3600 లో ఈజిప్ట్ స్వర్ణకారులు బంగారాన్ని కరిగించి, అందులో ఇతర లోహాలను తొలగించే ప్రక్రియను కనిపెట్టారు. ఈ విడగొట్టే లోహాలను వేడి చేయడానికి మట్టి గొట్టాలను వాడారు.

- క్రీస్తు పూర్వం 2600లో మెసపటోమియా స్వర్ణకారులు బంగారు ఆభరణాలు తయారు చేశారు.
- క్రీస్తు పూర్వం 1200–1500 మధ్య స్వర్ణకారులు 'లాస్ట్ వాక్స్ జ్యువెలరీ కాస్టింగ్ టెక్నిక్' కనుగొన్నారు. ఈ ప్రక్రియ వల్ల ఆభరణానికి గట్టిదనం, రంగుల్లో తేడాలు సాధ్యమయ్యాయి.
- క్రీస్తుపూర్వం 1223లో 'టుటాంకమన్ ఫ్యునరల్ మాస్క్' యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రాచీన ప్రపంచంలో స్వర్ణకారుల పనితనం, సృజనాత్మకతలకు నిదర్శనం ఇది.
- క్రీస్తు పూర్వం 950లో సోలోమన్ నిర్మించిన బంగారు ఆలయం. యెమెన్ రాణి షీబా, ఇజ్రాయెల్ రాజు సోలోమన్‌కు 2,500 కిలోల బంగారం బహూకరించింది. దాంతో సోలోమన్ దగ్గరున్న బంగారం 7,500 కిలోలకు చేరింది. అందులో కొంత బంగారంతో ఈ ఆలయం నిర్మించారు.
- క్రీస్తుపూర్వం 600లో బంగారాన్ని తొలిసారి డెంటిస్ట్రీలో వాడారు. ప్రత్యామ్నాయ దంతాల ఏర్పాటు ప్రక్రియలో బంగారం పాత్ర ఇప్పటికీ ఉంది.
- క్రీస్తు పూర్వం 564లో తొలి అంతర్జాతీయ గోల్డ్ కరెన్సీ, క్రోసెస్ రాజు బంగారం శద్ధి టెక్నాలజీని బాగా అభివృద్ధి చేశాడు. ప్రపంచపు తొలి బంగారు నాణెం 'క్రోసిడ్స్'ను విడుదల చేశాడు. ఆ నాణేలలో బంగారం ఏకీకృతంగా ఉండడంతో అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందింది.
- క్రీస్తు పూర్వం 300లో రోమన్లు బంగారాన్ని లైకర్గస్ కప్‌కు రంగు తేవడానికి ఉపయోగించారు. తొలిసారిగా బంగారం నానో పార్టికల్స్‌ను వాడారు. బంగారం పొడిని గాజులో కరిగించడం ద్వారా గాజు పాత్రకు ఎరుపు రంగు వెలుగును తీసుకొచ్చారు.
- క్రీస్తు శకం 1300 మొదటిసారిగా బంగారానికి హాల్‌మార్కింగ్ విధానం అమల్లోకి వచ్చింది. లండన్‌లోని గోల్డ్‌స్మిత్ హాల్‌లో బంగారం నాణ్యతను తనిఖీచేసి హాల్‌మార్కింగ్ చేసేవారు.
- 1422లో ఆఫ్రికా,సెంట్రల్ ఆసియాలనుంచి తెచ్చిన 4.26 మెట్రిక్ టన్నుల బంగారంతో వెనిస్ మింట్ 12 లక్షల గోల్డ్ డుకాట్స్‌ను తయారు చేసింది. ఈ చిన్న నాణేలు చాలా ప్రాచుర్యం పొందాయి.
- 1511లో స్పెయిన్ రాజు ఫెర్డినాండ్ బంగారం వేట పతాక స్థాయికి చేరింది."బంగారం తీసుకు రండి. వీలైతే మానవతా దృక్పథంతో, కాకపోతే ఏదో ఒక పద్ధతిలో తీసుకురండి" అని రాజు ఆదేశించాడు. దాంతో అమెరికా ఖండంలో అసాధారణ వేట మొదలైంది. కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే బంగారు నిల్వలు కలిగిన ఇన్‌కా, అజ్టెక్ సమాజాలు స్పెయిన్ దాడుల్లో ధ్వంసమయ్యాయి.
- 1717లో బ్రిటన్ గోల్డ్ స్టాండర్డ్ విధానం ప్రారంభమైంది. నిర్ణీత ధరకు బంగారం, కరెన్సీ మార్పిడిని ఖరారు చేశారు. ఒక ఔన్సు బంగారానికి మింట్ ధరను 77 షిల్లింగ్‌ల పదిన్నర పెన్నీలుగా నిర్ణయించారు.
- 1803లో పవియా యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ లుయిగి బ్రూగ్నటెల్లి తొలిసారిగా బంగారంతో ఎలక్ట్రోప్లేటింగ్ ప్రయోగాలు చేశాడు. గోల్డ్ ఎలక్ట్రో ప్లేటింగ్ వల్ల కండక్టివిటీ పెరుగుతుంది. ఈ శతాబ్దపు టెక్నాలజీలలో ఇది ఎంతో ఆవశ్యకం.
- 1848లో కాలిఫోర్నియాలోని సాక్రామెంటోలో సామిల్ భవనం నిర్మిస్తుండగా బంగారు పొరలను జాన్ మార్షల్ గుర్తించాడు. దాంతో ఆ ప్రాంతంలో బంగారం అన్వేషణ కోసం ప్రపంచంలోని వివిధ ప్రాంతాలనుంచి 40 వేల మంది అక్కడికి పరుగులుతీశారు. అది అతి పెద్దగోల్డ్ రష్.
- 1885లో దక్షిణాఫ్రికాలో గోల్డ్ రష్ ప్రారంభమైంది. జోహాన్స్ బర్గ్ సమీపంలో ఒక భవన నిర్మాణానికి రాళ్లు తవ్వుతుంటే ఆస్ట్రేలియన్ మైనర్ జార్జి హారిసన్‌కు బంగారు ఖనిజం కనిపించింది. దాంతో మైనర్లు అక్కడికి పరుగులుతీశారు.
- 1885లో జార్ చక్రవర్తి మూడవ అలెగ్జాండర్ కోసం కార్ల్ ఫాబెర్గే తన తొలి బంగారు ఇంపీరియల్ ఈస్టర్ ఎగ్‌ను తయారు చేశాడు. దాని పేరు ది హెన్ ఎగ్ అని పెట్టాడు. ఆ బంగారు కోడిగుడ్డును జార్ చక్రవర్తి తన భార్య మేరియా ఫెడోరోవ్నాకు బహూకరించాడు. ఈ సంప్రదాయం1917 వరకూ కొనసాగింది.



- 1967లో దక్షిణాఫ్రికా తొలిసారిగా క్రుగెరాండ్ నాణాన్ని ముద్రించింది. ఇది బాగా ప్రాచుర్యం పొందింది. నిజానికి దీనిని తొలుత కరెన్సీగా చెలామణి చేయడానికి ఉద్దేశించారు.
- 1981లో మైక్రోచిప్స్‌లో బంగారాన్ని వాడిన ఏడాదే, మానవ అంతరిక్ష యాత్రలో బంగారాన్ని వాడారు. నౌకలోని అత్యంత సున్నిత పరికరాలను రేడియేషన్ ప్రభావం నుంచి కాపాడేందుకు బంగారం ఉపయోగించారు. 1980లో అంతరిక్ష నౌక నిర్మాణంలో 41కిలోల బంగారాన్ని వినియోగించారు.
- 1985లో ఫార్మాసూటికల్ సంస్థ స్మిత్ లైన్ అండ్ ఫ్రెంచ్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌కు చికిత్స కోసం బంగారం ఆధారంగా తయారుచేసిన ఔషధం ఆరనోఫిన్‌ను రూపొందించింది. ఈ ఔషధానికి ప్రభుత్వ అనుమతి లభించి, రోగులకు అందుబాటులోకి వచ్చింది.
- 1961లో అమెరికాలోని బెల్ ల్యాబ్స్‌లో మైక్రో చిప్‌లో తొలిసారిగా బంగారంతో చేసిన తీగను ఉపయోగించారు. ఇప్పుడు ప్రతి ఏటా కోట్లాది చిప్‌లు ఈ విధంగా తయారవుతున్నాయి.
- 2001లో హృద్రోగ చికిత్సలో కూడా బంగారం వినియోగం మొదలైంది. బోస్టన్ సైంటిఫిక్ సంస్థ తొలిసారిగా గోల్డ్ ప్లేటెడ్ స్టెంట్ (నిరాయల్)ను గుండె శస్త్ర చికిత్సలో ఉపయోగించింది.పెద్ద ధమనులు, సిరలలో అమర్చే ఈ స్టెంట్‌లు రక్తప్రసరణ సరిగ్గా ఉండడానికి దోహదపడతాయి.
- 2003లో వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ చైనాలో తొలిసారిగా 18 క్యారట్ల బంగారు ఆభరణాలు కె–గోల్డ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా కొత్త మార్కెట్ సెగ్మెంట్‌ను ఆవిష్కరించింది. తెలుపు, పసుపు వర్ణాలలో ఉండే ఈ ఆభరణాలకు ఇటాలియన్ డిజైన్లు స్ఫూర్తి. ◆

నవ్వుల్ – పువ్వుల్



తర్వాత తెలిసింది



కోటి : ఎందుకురా, అలా బాధపడుతున్నావ్?

సూరి : వెయ్యి రూపాయల నోటు దొరికిందని పోలీస్ స్టేషన్‌లో ఇచ్చా. ఆ తర్వాత తెల్సింది అది నాదేనని.

కోటి : అయితే వెళ్ళి అడగొచ్చు కదా?

సూరి : అది నీదేనని నిరూపించుకో అంటున్నార్రా పోలీసు వాళ్లు!

పర్సు మిస్సు



సత్యం : కండక్టర్‌గారూ, బస్సులో నా పర్సు పడిపోయిందండీ. వేయి రూపాయలుంటాయి.

మూర్తి : బస్సు ఆపుతాను గానీ, ఎక్కడ ఉందో జాగ్రత్తగా వెతకండి.

సత్యం : ముందు మీ పర్స్‌లో ఉన్న రూపాయలన్నీ ఇచ్చేయండి. పాసింజర్స్ అంతా దిగినాక నిదానంగా పర్స్ వెతుక్కుని వాటిని తీసుకోండి!

దేనికి?



తండ్రి : మా అబ్బాయిని మీ కాన్వెంట్‌లో జాయిన్ చేస్తామండీ!

టీచర్ : అబ్బాయి మెయిల్ ఐ.డి.ని కూడా ఇవ్వండి.

తండ్రి : ఏం దేనికి?

టీచర్ : ప్రతిరోజూ హోంవర్క్‌ని బాబు మెయిల్‌కు పంపుతాం.

పాట పాడిస్తాం



రాజేష్ : ప్రతీసారీ మీ అమ్మ పాట పాడతాది అంటుంటావు కదా, ఈసారి మన స్కూలు వార్షికోత్సవానికి మీ అమ్మను తీసుకురా, పాట పాడిస్తాం.

సురేష్ : మా అమ్మ పాట పాడాలంటే మీరు చీటీ కట్టాలి.

రాజేష్ : నేను చీటీ కట్టడమేంటి?

సురేష్ : మరి మీ అమ్మ పాడేది చీటీపాట కదా!

మీకో దణ్ణం

శివాజి : నేను పరీక్ష పాసవడానికి మీరేం చేయమన్నా చేస్తా స్వామీ!

స్వామీజీ : ఓ ఆరు నెలలు కఠిక ఉపవాసం చేయి.

శివాజి : అమ్మో.. నా వల్ల కాదు.

స్వామీజీ : ఓ సంవత్సరం పాటు హిమాలయాల్లో తపస్సు చేయి. అదీ చేయకపోతే నీవిక పాస్ కావు.

శివాజి : ఎందుకు పాస్ కాను. కష్టపడి చదివి ఈజీగా పాసవుతా! మీకో దణ్ణం స్వామి.

గిఫ్ట్



రాణి : నా పెళ్ళికి ఖచ్చితంగా గుర్తు పెట్టుకుని రావాలి సుమా!

రాధ : అంత గుర్తు పెట్టుకోవాలంటే శుభలేఖ ఒకటే ఇస్తే కష్టమవుతుంది గానీ, వేరే ఏదైనా గిఫ్ట్ కూడా ఇచ్చి వెళ్ళు!

లిఫ్ట్ ప్లీజ్



రాము : సార్, కాస్త లిఫ్ట్ ఇస్తారా?

డ్రైవర్ : మీరు దేనిని ఆపారో తెలుసా? అంబులెన్స్‌ని!

రాము : నేను వెళ్ళేది హాస్పిటల్‌కే సార్!

బిల్లు



రోగి : ఆపరేషన్ అయిపోయింది కదా డాక్టర్. మీరు బాధ తెలియకుండా ఇంజక్షన్ ఇస్తామంటారేం?

డాక్టర్ : ఇప్పుడు నీవు బిల్లు చెల్లించే టైమొచ్చింది. మరి! మత్తులో నీవెంతయినా ఇచ్చేస్తావుగా అందుకని.

మీరు కూడా

బాస్ : ఆఫీసుకి లేటుగా వచ్చినా ఎంత నీట్‌గా వచ్చావయ్యా?

గుమాస్తా : మీరు కూడా నీట్‌గా రావాలంటే లేటుగా రావాలి మరి!

అదేంటి?



శీను : ఎప్పుడూ గుండు గీయించుకునే వుంటావేంరా?

కృష్ణ : లేకపోతే కూరల్లో నా వెంట్రుకలు పడిపోతున్నాయని గొడవ పెడుతుందిరా మా ఆవిడ.

శీను : అదేంటి?

కృష్ణ : ప్రతీదీ వండేది నేనేగా మరి!

అందుకని

రోగి : మీరెంత ప్రయత్నించినా నా పన్ను పీకలేరు డాక్టర్!

డెంటిస్ట్ : అదేం?

రోగి : నా పన్ను నాగార్జున సిమెంట్‌తో కట్టించాను. అందుకని.

- ముత్యాల శ్రీశరత్‌బాబు, ఫోన్ నెం : 9963298921

కన్యాశుల్కం - గురజాడ

తెలుగు సాహిత్యంలో సాటిలేని రచన. అగ్రవర్ణ ఛాందసంపైన అగ్నికురిపించి అభాగ్య బాల వితంతువుల కోసం ఎలుగెత్తిన నాటకం. కపటం నిండిన గిరీశాలను గురించి జాతిని ఆనాడే హెచ్చరించిన అపురూప సృష్టి.

మహా ప్రస్థానం - శ్రీశ్రీ



తెలుగు జాతిని నాటికీ నేటికీ కదం తొక్కించే మహత్తర ప్రజా కవిత్వం. తెలుగు భాషకు కొత్త వూపునూ రూపునూ అందించిన అభినవ మహాభారతం. శ్రమైక జీవన సౌందర్య సంకేతం.

గబ్బిలం - జాషువా

తరతరాల అణగారిన జాతుల ఆవేదనకు అక్షర రూపం. అపురూప భావ పద చిత్రాలతో వర్ణ వ్యవస్థను ప్రశ్నించిన సాహసం. మేఘసందేశానికి ప్రత్యామ్నాయమైన గబ్బిలం సందేశం.

అమృతం కురిసిన రాత్రి - బాల గంగాధర తిలక్

అభ్యుదయ కవిత్వ యుగంలో విలక్షణ విభిన్న స్వరం. జీవన సౌందర్యాన్ని భావనా సౌకుమార్యాన్ని మేళవించిన సృజనశీలత.

మట్టి మనిషి - వాసిరెడ్డి సీతాదేవి

భూస్వామ్య యుగపు యుకకష్టం నుంచి పెట్టుబడిదారీ వన్నెచిన్నెల్లోకి ప్రయాణం. తరాల మధ్య అంతరాలను చాటిన అక్షర రూపకం.

మాలపల్లి - ఉన్నవ లక్ష్మీనారాయణ

దళిత జాతుల ఘోషకు ఆర్త ఆవేదనా రూపం. పరాయిపాలనలో ప్రజ్వరిల్లిన స్వాతంత్ర కాంక్ష, సామ్యవాద తొలి సవ్వడి.

రథచక్రాలు - మహీధర రామ్మోహనరావు

తెలుగు నాట ప్రజా ఉద్యమ రాజకీయాల పరిణామ రూపం. పల్లెసీమల్లో రాజకీయ సామాజిక వైరుధ్యాల ఆవిష్కరణ. కొత్త తరం ధిక్కారం, ఆదర్శ స్వరం.

ప్రజల మనిషి - వట్టికోట ఆళ్వారుస్వామి

నిజాం వ్యతిరేక సాయుధ పోరాటపు తొలి ఘట్టం. పాటమరిస్తున్న చైతన్యం, పాలి కేక పెడుతున్న యువతరం ఉద్వేగమే ఈ రచన.

చిల్లర దేవుళ్లు - దాశరథి రంగాచార్య

ప్రజా పోరాటానికి ప్రజల భాషలో సజీవ దృశ్య కావ్యం. దొరలు గడీలు ఆడబాపలు వెట్టిబానిసల హృదయ ఘోష.

బారిష్టరు పార్వతీశం - మొక్కపాటి నరసింహారావు

చెరగని హాస్యపు చిరునామా. ఆధునిక జీవితపు గజిబిజిలో అమాయకుని అవస్థ. విదేశీ సంపర్కంలో వింత అనుభవాలు.

విమర్శా శిల్పం- వల్లంపాటి వెంకట సుబ్బయ్య



సాహిత్య రచనకూ ఆస్వాదనకూ ప్రామాణికమైన విమర్శనా దర్శిని. ఉదాహరణలతో పోలికలతో అవగాహన పెంచే అరుదైన రచన.

స్వీయ చరిత్రము- కందుకూరి వీరేశలింగం

తెలుగు జాతి వైతాళికుని జీవిత గమనం. అన్యాయాన్ని అంధ విశ్వాసాలను అడుగడుగునా ప్రతిఘటించిన సాహసి అనుభవాలు. మహిళా బాంధవుని జ్ఞాపకాలు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర- సురవరం ప్రతాపరెడ్డి

ప్రజల కోణంలో చరిత్ర రచనకు కొత్త వరవడి. సమాజాన్ని సామాన్యులనూ పట్టిచూపిన దిక్సూచి.

మాభూమి సుంకర, వాసిరెడ్డి

సాటిలేని సమరశీల నాటకం. తెలంగాణ పోరాటానికి సజీవ చిత్రణ. ప్రజలను వుద్రూత లూపి పాలకుల నిషేధానికి గురైన ప్రజా నాటకం.

వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - పుచ్చలపల్లి సుందరయ్య

ఒక మహత్తర పోరాటానికి సాధికార సమగ్ర చరిత్ర. ఆధారాలు అంకెలు వాస్తవాలు సమర శీల అధ్యాయాలను కళ్లకు కట్టే అపురూప గ్రంథం.

అసమర్థుని జీవనయాత్ర - గోపీచంద్

సుపరిచితమైన సుప్రసిద్ధ నవల. అసమర్థత మూలాలు చెప్పే మనో విశ్లేషణ. మనసులు పట్టి చూపిన సృజన.

చివరకు మిగిలేది - బుచ్చిబాబు



సౌందర్య దృష్టి ప్రధానమైన తాత్వికాన్వేషణ. అమ్మ గురుతుకూ అనురాగమయ స్పర్శకూ అసూయా ద్వేషాలకూ మధ్య అలమటించిన ఒక మనిషి అనుభవ సంపుటి.

మైదానం - చలం



తెలుగు సాహిత్యంలో తొలి సంచలనం. మహిళలూ మనుషేలనన్న మేల్కొలుపు. ఒక సార్వత్రిక ధిక్కార నవల.

ఈ పుస్తకాలు దొరుకు చోటు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

బండారు అచ్చమాంబ కథలు

ఆలస్యంగా వెలుగు చూసిన ఆధునిక తెలుగు కథారంభకురాలు. ఆనాడే అతి నిశితంగా ఆలోచించి అందించిన అపురూప కథలు.

బుడుగు - ముళ్లపూడి వెంకట రమణ



తెలుగింటి పిల్లల అల్లరికి మచ్చు తునక. పెద్దలను ముప్పు తిప్పలు పెట్టే బాలజ్ఞానం. బాల్యానుభూతులను తట్టి లేపే మధురాక్షరి.

కుటుంబరావు కథలు

సంస్కారానికి సామాజిక అవగాహనకు నిర్వచనమైన మేటి కథకుడి రచనలు. ప్రతి వాక్యంలో పొదిగిన జీవితం, ఒదిగిన అనుభవం.

పుణ్యభూమీ కళ్లుతెరు- బీనాదేవి

ధనశక్తుల విషకోరలలో నలిగే అసంఖ్యాక అసహాయ జీవుల ఆక్రందన.. న్యాయ వ్యవస్థ కోరల్లో అధికార యంత్రాంగం ఉక్కుపాదాల కింద మూలుగు..

చాసో కథలు

ఒక ప్రబుద్ధ మేధ పరిణత రచనలు. జీవితం సిద్ధాంతం మానవానుభవాల అపురూప సమ్మేళనం.

సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర



వెయ్యేళ్ల తెలుగు సాహిత్యానికి దారి దీపం. సూక్ష్మంలో మోక్షంలా వందల ఏళ్లను సందర్శింపచేసే అరుదైన సంపుటాలు.

సారస్వతావలోకనం- రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

పాత సాహిత్యం పట్ల కొత్తచూపు. రాయలనాటి రసికతనూ కరిగిపోయిన రసజ్ఞతనూ ఆవిష్కరించే అక్షరాంజలి.

వేట కుక్కలు- పతంజలి

నిప్పులు కక్కే వ్యంగ్య వైభవం. నిలదీసి చదివించే నిష్ఠుర నిజాల నిలదీత. మధ్యతరగతిని పట్టి కుదిపేసే పసిడి పలుకులు ఈ రచన ప్రత్యేకత.

రత్తాలు-రాంబాబు - రావిశాస్త్రి

ఆధునికత చాటున పెరికితనాన్ని మురికితనాన్ని కడిగిపారేసే ఆక్షేపణ. అనితర సాధ్యమైన పోలికలూ.. ఆశ్చర్యం నింపే వాస్తవికత

పెన్నేటి పాట- విద్వాన్ విశ్వం

రాయలసీమ దురవస్థకు దర్పణం. అలతి అలతి పదాలతో గంభీర సందేశం. వ్యధార్త జీవన గీత.

పాకుడు రాళ్లు - రావూరి భరద్వాజ

వెండితెర వెనక వేదనలను వెల్లడించిన నవీన మహాకావ్యం.జ్ఞానపీఠం వరకూ పయనించిన ప్రసిద్ధ గ్రంథం.

నా గొడవ - కాళోజీ

ఏ పటాటోపాలు లేని శుద్ధ ప్రజా కవిత్వం. ఆరు దశాబ్దాల పరిణామ క్రమంపై ఒక నిబద్ధ నిరాడంబర జీవి అక్షర స్పందన. తెలంగాణ గుండె చప్పుడు ఈ రచన.

పుస్తకాల పండుగలు

అక్కడ ... అక్షరాలు మాట్లాడతాయి! పుస్తకాలు పలుకరిస్తాయి! అంతటితో ఆగుతాయా!? క్షేమ సమాచారాలు అడుగుతాయి. అంతేనా! మిత్రులకు... కొత్త కొత్త విశేషాలను అందించేందుకు అభిమానంగా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తాయి. ఎంతో ఆతృతతో, ఆశతో వచ్చిన పుస్తక ప్రేమికులకు విజ్ఞాన వీధుల్లో విహరింపజేస్తాయి ఒక్క మాటలో చెప్పుకోవాలంటే అక్కడ... అడుగడుగున అక్షరాభిషేకమే! ప్రాంగణంలోకి అడుగెట్టిన ప్రతి ఒక్కరూ ఆ అక్షరాభిషేకంలో తడిసి ముద్దయిపోవాల్సిందే. ఈ అద్భుతావకాశం లభించేది మాత్రం పుస్తక మహోత్సవాల్లోనే. ప్రతి ఏడూ ... లక్షలాది పుస్తకాలతో తరలివచ్చి ... అక్షర ప్రియులను ఆర్తిగా పలుకరించి వెళ్లే... పుస్తకాల పండుగల గురించినదే ఈ వారం అట్టమీది కథ.

- కె.చరిత

బుక్ ఫెస్టివల్ అంటే అందరి పండుగ! చిన్న పెద్ద కుల మత వర్గ వైషమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ... ఎంతో ఇష్టంగా పాలు పంచుకునే ఉత్సవం. అటువంటి పుస్తక మహోత్సవాల పేరు చెప్పగానే గుర్తొచ్చేవి కొన్నైతే... మర్చిపోలేనివి మరి కొన్ని. మన రాష్ట్రంలో చెప్పుకోదగినది 'విజయవాడ బుక్ ఫెస్టివల్'. రాష్ట్రం దాటితే... కలకత్తా, ఢిల్లీ, చెన్నై, కొచ్చి, హైదరాబాద్.... పుస్తక మహోత్సవాలను చెప్పుకోవాలి. ఇక దేశం దాటితే మొట్టమొదటగా ప్రస్తావించుకోవాల్సింది 'ఫ్రాంక్‌ఫర్ట్ బుక్ ఫెస్టివల్'. ప్రపంచంలో మరెక్కడ ఏ పుస్తకాల పండుగ జరిగినా దీని తర్వాతే. అంత భారీ ఎత్తున నడుస్తుందీ ప్రపంచ పుస్తకాల పండుగ.

విజయవాడ బుక్ ఫెస్టివల్

నగర వాసులను నూతన సంవత్సరంతోపాటుగా పలుకరించే పండుగ పుస్తకాల పండుగ. ఇంకా చెప్పాలంటే సంక్రాంతికి ముందుగానే క్రాంతిని తీసుకొచ్చే పండుగ విజయవాడ బుక్ ఫెస్టివల్. ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుంచి పదకొండవ తారీకు వరకు పుస్తక ప్రియులను అలరించే ఉత్సవం బుక్ ఫెయిర్. పదకొండు రోజులూ బందర్ రోడ్డులోని పి.డబ్ల్యు.డి గ్రౌండ్స్ అక్షర కళాభిమానులతో కళకళలాడిపోతుంది. పుస్తక నడక, సంగీత నృత్య కార్యక్రమాలు, విద్యార్థులకు అనేక రకాల పోటీలు, పుస్తకావిష్కరణలు... ఒకటా రెండా! సాహిత్య, ప్రచురణ రంగాల్లో ఎనలేని కృషి జరిపిన వారి శత జయంతులు, చిరస్మరణీయుల స్మరణలూ ...అన్నీ పుస్తకాల విందుకు అదనంగా అందేవే! పైగా పుస్తక మహోత్సవ ప్రాంగణానికి ప్రచురణ రంగంలో కృషి చేసిన వారి పేరు పెట్టి సత్కరించుకోవడం ఇక్కడి ఆనవాయితీ. మొట్టమొదటి విజయవాడ బుక్ ఫెస్టివల్ 1989లో ఎన్.బి.టి నిర్వహించింది. విజయవాడ నగరం నడిబొడ్డున తొలి పుస్తక మహోత్సవం ప్రారంభమైన వర్షపు రోజును సాహితీప్రియులెన్నటికీ మరువలేరు! ఆ తర్వాత స్థానిక పుస్తక ప్రచురణ కర్తలు బుక్ ఫెస్టివల్ సొసైటీగా ఏర్పడి... ఇప్పటి వరకు పాతిక పుస్తక మహోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించారు (వీరికి పలు అంశాలలో స్ఫూర్తినిచ్చింది మాత్రం కలకత్తా పుస్తక మహోత్సవమనే చెప్పుకోవాలి. సత్యజిత్ రే వంటి సుప్రసిద్ధులు ముందు పీఠిన నిలబడి చేసిన 'పుస్తక నడక'ను విజయవాడ నగర వాసులకూ పరిచయం చేశారు). మరో మూడు రోజుల్లో రానున్న ఇరవై ఆరవ బుక్ ఫెయిర్ కోసం నగరం యావత్తూ ఎదురు చూస్తోంది.

విజయవాడలోనే కాక...విశాఖ, తిరుపతి, ఒంగోలు, రాజమండ్రి, ఖమ్మంలో కూడా అడపా దడపా పుస్తక మహోత్సవాలు జరుగుతూనే వుంటాయి. హైదరాబాద్ బుక్ ఫెస్టివల్ గురించి తప్పక ప్రస్తావించుకోవాలి. ఉమ్మడి రాజధాని

హైదరాబాద్‌లో డిసెంబర్ చివరి వారాల్లో జరిగే ఈ పుస్తక మహోత్సవం గురించి తెలియని తెలుగు వారుండరు! అది మొన్న 26వ తేదీనే ఘనంగా ముగిసిపోయింది.

ఇంటర్నేషనల్ కలకత్తా బుక్ ఫెయిర్



మన దేశంలోకెల్లా ప్రసిద్ధ పుస్తకాల పండుగ ఇది. 1976లో ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం పన్నెండు రోజుల పాటు జరిగే ఈ బుక్ ఫెయిర్‌లో ... వేలాది బుక్ స్టాళ్లు, లక్షలాది పుస్తకాలు కొలువు తీరతాయి. అదే స్థాయిలో పుస్తక ప్రేమికులూ పాల్గొంటారు. ఆసియా ఖండంలో జరిగే పుస్తక మహోత్సవాల్లోనే ఇది అతి పెద్దది. ఫ్రాంక్‌ఫర్ట్ బుక్ ఫెయిర్, లండన్ బుక్ ఫెయిర్ తర్వాత చెప్పుకోదగిన బుక్ ఫెయిర్ ఇది. నిజానికి బుక్ ఫెయిర్ జరిగినన్నాళ్లు (జనవరి-ఫిబ్రవరి మాసాల్లో) ...ఆ ప్రాంగణంలో ఓ పిక్నిక్ వాతావరణం నెలకొంటుంది. కుటుంబ సమేతంగా ప్రతి రోజూ బుక్ ఫెయిర్‌కు తరలి రావడం కోల్‌కత్తావాసుల ప్రత్యేకత. ఒక స్టాల్ లోపలికి వెళ్లడానికే క్యూలో కనీసం అర్ధగంట సేపు వేచి వుండాల్సిన సందర్భాలెన్నో. పుస్తకావిష్కరణ నాడే పదివేల కాపీలు అమ్ముడైన అద్భుతాలూ జరిగాయి. రచయితలకు గౌరవ సత్కారాలు, పుస్తకాల రెపరెపలతో పాటు... రచయితలు, కవులు, కళాకారులు, నృత్యకారులతో ఉత్సవ ప్రాంగణం నిండుగా వుంటుంది. వీరికి తోడు చిరుతిళ్ల అమ్మకం దార్లు చేసే సందడి అంతా ఇంతా కాదు. విదేశీ బుక్ స్టాళ్లు పుస్తక మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణ.

న్యూ ఢిల్లీ వరల్డ్ బుక్ ఫెయిర్

భారతదేశంలో చెప్పుకోదగిన పుస్తకాల పండుగ ఇది. తొలిసారిగా 1972లో ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం జరిగే ఈ పుస్తకాల పండుగతో ప్రగతి మైదానం పులకరిస్తుంది. ఇక్కడికి దేశ నలుమూలల నుండి వందలాది మంది పుస్తక విక్రేతలు వచ్చి పాల్గొంటారు. కనీసం ఇరవై దేశాలకు సంబంధించిన బుక్ స్టాళ్లు ఇక్కడ కొలువు తీరతాయి. ప్రతి సంవత్సరం ఏదో ఒక దేశపు 'థీమ్' తీసుకొని ఆ సంస్కృతిని ప్రతిబింబించే పుస్తకాలను, కళాకృతులను ప్రదర్శించడం ఇక్కడి ఆనవాయితీ. రచయితలతో ముఖాముఖి, రచయితల స్వీయ పుస్తక పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఫెయిర్‌లో అదనపు ఆకర్షణ. ప్రసిద్ధ రచయితలను కలుసుకోవడానికి... పాఠకుల నాడి తెలుసుకోవడానికి... ఔత్సాహిక రచయితలకు ఇదో అద్భుతావకాశం.

కొచ్చి ఇంటర్నేషనల్ బుక్ ఫెస్టివల్

కేరళ పేరు చెప్తే చాలు. నూటికి నూరు శాతం అక్షరాస్యతను సాధించిన గ్రామాలు గుర్తొస్తాయి. చదువుల తల్లి కొలువు తీరిన గడ్డ మీద

లక్ష టైటిల్స్‌తో బాలసాహిత్యం ప్రత్యేకం

పుస్తక ప్రదర్శనలో పిల్లల సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలు, అనువాదాలు, అన్నీ పుస్తకాలు దొరుకుతాయి. పిల్లల మేధస్సుకు పదును పెట్టే పుస్తకాలు, మనో వికాసాన్ని పెంచేవి, భౌగోళిక పరిస్థితులపై అవగాహన కలిగించే పుస్తకాలు మొత్తం సుమారు లక్ష టైటిల్స్‌తో బాల సాహిత్యం పుస్తక ప్రదర్శనలో ఈ సారి ప్రత్యేకంగా కొలువుదీరనున్నాయి. గత మూడేళ్లనుండి పుస్తకాల కొనుగోలు 30శాతం పెరిగింది. గత ఏడాది కంటే ఇంకా మెరుగ్గా, వినూత్నంగా అన్ని రకాల పుస్తకాలను ప్రజలకు పరిచయం చేసేందుకు పుస్తక ప్రదర్శన సిద్ధంకాబోతుంది. పుస్తకప్రియులకు 10శాతం రాయితీ కల్పిస్తున్నాము. పాఠకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-మనోహర్ నాయుడు, విశాలాంధ్ర పబ్లికేషన్స్.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విజయవాడలో మొట్టమొదటి బుక్‌ఫెస్టివల్ 1989లో నేషనల్ బుక్‌ట్రస్ట్ వారు నిర్వహించారు. వారి స్ఫూర్తితో ఇక్కడున్న ప్రధాన పబ్లిషర్స్ అందరూ సొసైటీగా ఏర్పడి 1991నుండి పుస్తకాల పండుగను నిర్వహిస్తున్నాము. 80 స్టాల్స్‌తో ప్రారంభమైన పుస్తక ప్రదర్శన, ఈ ఏడాది సుమారు 350 స్టాల్స్‌పైగా పాల్గొంటున్నాయి. కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కల్చరల్ డిపార్ట్‌మెంట్ స్వయంగా ప్రతి జిల్లాలో బుక్ ఎగ్జిబిషన్స్ నిర్వహిస్తుంది. అలా మన ప్రభుత్వం కూడా 13 జిల్లాల్లో పుస్తక ప్రదర్శనలను ఏర్పాటుచేసేందుకు కృషి చేయాలి. మనిషి... మనిషిగా బతికేందుకు సాహిత్యం ఎంతో ఉపకరిస్తుంది. కావున సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

-స్వర్ణ వెంకట నారాయణ ,
విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటి కార్యదర్శి.

పుస్తక ప్రియులకు పండుగ



ఈ పదకొండు రోజులూ పబ్లిషర్స్‌కు, పుస్తక ప్రియులకు ఒక పండుగలా ఉంటుంది. మాకు ఇది పదకొండు రోజుల పండుగ. ఈ రోజు టెలీ సీరియల్స్ మోజులోపడి పుస్తకాలు చదవడం తగ్గిపోయింది అని ఎవరైనా అంటే, అందుకు నేను ఏకీభవించను. ఏందుకంటే నేటికీ యద్దనపూడి సులోచనా రాణిగారి నవలలు కోసం పరితపించిపోయే వారున్నారు. టీవీలో చోటా భీం నాటిక చూసి, చోటా భీం పుస్తకం కావాలని మారం చేసి మరీ తల్లిదండ్రులచేత కొనిపించుకునే పిల్లలు నిత్యం మాకు తారసపడతారు. ఈ బుక్స్, డిజిటల్ బుక్స్ ఎన్ని వచ్చినా పుస్తకం స్థానం పుస్తకానిదే.

-అశోక్ కుమార్, అలకనంద పబ్లికేషన్స్.

జరిగే మరపురాని మహోత్సవం 'కొచ్చి ఇంటర్నేషనల్ బుక్ ఫెస్టివల్'. ఎర్నాకులతప్పన్ గ్రౌండ్స్ దీనికి వేదిక. లక్షలాదిగా కొలువు తీరే పుస్తకాలతో పాటుగా జరిగే పలు సాహితీ కార్యక్రమాలు కనువిందు చేయడమే కాదు. ఆలోచింపచేస్తాయి. నవంబర్, డిసెంబర్ మాసాల్లో అంతర్రాష్ట్ర పుస్తకోత్సవ సమితి దీన్ని నిర్వహిస్తుంది. సాహితీ సాంస్కృతిక సంబంధిత కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు ప్రతి సాయంత్రం వుంటాయి. పుస్తక పఠనాన్ని పెంపొందించడం, రచనలను ప్రోత్సహించడం, అక్షరాస్యత పట్ల అవగాహన కల్పించడం ఈ బుక్ ఫెయిర్ ప్రధాన లక్ష్యాలుగా వున్నాయి.

చెన్నై బుక్ ఫెయిర్

మ్యూజిక్ ఫెస్టివల్ ముగిసిన వెంటనే చెన్నై వాసులను పలుకరించే పండుగ చెన్నై బుక్ ఫెయిర్. 1977వ సంవత్సరం నుంచి సాహిత్యాభిమానులను అలరిస్తున్న పండుగ. కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగ కాలంలో... పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవం కోసం తమిళ తంబీలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. దక్షిణ భారత దేశంలోని పలువురు ప్రచురణకర్తలు, పుస్తక విక్రేతలు ఈ పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇక్కడ జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకోసం ఎదురుచూసే ప్రత్యేక అభిమానులు, ప్రేక్షకులు వుంటారు. ఈ ఏడాది 700 బుక్ స్టాళ్లు కొలువు తీరగా... ఐదు లక్షల మంది పుస్తక ప్రేమికులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. ఢిల్లీ, కలకత్తా పుస్తక మహోత్సవాల తర్వాత చెప్పుకోదగిన బుక్ ఫెయిర్ ఇది.

ఇవి కాక... తిరువనంతపురం (డిసెంబర్), ముంబై (జనవరి), జైపూర్ (సెప్టెంబర్-అక్టోబర్), పూనే (అక్టోబర్)... వంటి అనేక ప్రధాన నగరాలలో పుస్తకాల పండుగలు జరుగుతున్నాయి.

ఫ్రాంక్‌ఫర్ట్ బుక్ ఫెయిర్

ప్రపంచంలోకెల్లా అత్యంత పురాతన పుస్తక మహోత్సవమిది. వందకు పైగా దేశాలకు సంబంధించిన ప్రచురణకర్తలు, పుస్తక విక్రేతలు... జర్మనీలో

సాహిత్యానికి ప్రజాదరణ తగ్గలేదు

పుస్తక ప్రదర్శన అన్నది పబ్లిషర్స్‌కు పాఠకులకు మధ్య వారధిలా ఉంటుంది. నేటికీ తెలుగులోకి అనువాదమయిన గోర్కి కథలు, దోస్తవస్కీ, టాల్‌స్టాయ్ వంటి గొప్ప రచయితల సాహి త్యానికి ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదు. నేడు పుస్తకం పరిధి కేవలం నవల, కథ మాత్రమే కాదు, ఆరోగ్య సూత్రాలు, పర్సనాలిటీ డెవలప్ మెంట్ , ప్రకృతి శాస్త్రం, జీవ శాస్త్రం వంటి విషయాలకు సంబంధించిన అంశాలన్నీ చోటు చేసుకున్నాయి. అయితే ఎడ్యుకేషన్ సిలబస్‌కు దగ్గరగా ఉండేవి, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను మాత్రమే యువత ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఇది మంచి పరిణామం కాదని నా భావన.

-ఎ.గాంధి, పికాక్ క్లాసిక్స్.

విద్యలో సాహిత్యం భాగమైతేనే...

తెలుగు భాష గొప్ప, తెలుగు ప్రజలు గొప్ప అని చెప్పేవారు భాషా సాహిత్యాల అభివృద్ధికి ఏం చేస్తారో చెప్పాలి. గతం తెలుసుకోవాలన్నా, వర్తమానం అర్థం కావాలన్నా, భవిష్యత్ సమాజాన్ని నిర్మించాలన్నా సాహిత్యం ముఖ్యమైనది. టెక్నాలజీకి సాహిత్యం తోడైతేనే ఉన్నత సమాజం సాధ్యమవుతుంది. లేకుంటే ఈ అభివృద్ధి అమానవీయతను పెంచి పోషిస్తుంది. ఇంతటి ముఖ్యమైన రంగాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారో చెప్పాలి. ప్రచురణకర్తలు, పౌరసమాజం, మీడియా సమిష్టి కృషి వల్ల విజయవాడ బుక్ ఫెస్టివల్‌కు ఆ కీర్తి దక్కింది. ప్రభుత్వం కూడా తోడై గ్రంథాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలను కొత్త పుస్తకాలతో నింపాలి. బుక్ రీడింగ్ కోసం విద్యాసంస్థల్లో ఒక పీరియడ్ కేటాయించాలి. అప్పుడే విద్యార్థులకు విద్యలో సాహిత్యం భాగమవుతుంది. వ్యక్తిత్వం వికసిస్తుంది. ఉన్నత సమాజం కోసం కొత్త ప్రభుత్వాల్ని ప్రశ్నించాల్సిన సందర్భం ఇదే.

-కె.లక్ష్మయ్య, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్.

కలకత్తా తర్వాత విజయవాడే

కలకత్తా తర్వాత విజయవాడలోనే పుస్తకాల పండుగ వైభవంగా జరుగుతుంది. గత 26 ఏళ్ల నుండి జనవరి 1 నుండి 11 వరకు విజయవాడ బుక్ ఎగ్జిబిషన్ సొసైటి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి ప్రవేశ రుసుం ఉండదు. ఖమ్మం, పశ్చిమగోదావరి, విశాఖ, నెల్లూరు తదితర జిల్లాల నుండి కూడా సందర్శకులు వస్తుంటారు. పబ్లిషర్స్ మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుంది. వ్యాపారధోరణితో కాకుండా జ్ఞానదీపికలైన పుస్తకాలను ప్రజలకు అందించాలనే సంకల్పం ప్రతి పబ్లిషర్‌లో కనిపిస్తుంది. ఈ సారి రీజనల్ లాంగ్వేజస్ స్టాల్స్ నిర్వాహకులకు రాయితీ కూడా ఇచ్చారు.

-విశ్వేశ్వరరావు, శ్రీ శ్రీ పబ్లికేషన్స్.

జరిగే ఈ బుక్ ఫెయిర్‌లో పాల్గొంటారన్నదాన్ని బట్టే విస్తృతిని అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా అక్టోబర్ మాసంలో జరిగే ఈ పుస్తకాల పండుగకు ....జీవితంలో ఒక్కసారైనా వెళ్లిరావాలని కోరుకునే పుస్తక ప్రియులెందరో! అయితే పుస్తకాల పురుగులుగా పేరు గాంచిన వారెవరైనా అక్కడికెళితే ఒక పట్టాన ఓ నిర్ణయానికి రాలేరు. అన్ని లక్షల పుస్తకాలు కళ్ల ఎదురుగా వుంటే దేన్ని విడిచి పెట్టడం, దేన్ని సొంతం చేసుకోవడం అన్న సంశయంలోనే సమయమంతా గడిచిపోతుంది. ఇది కాక 'బుక్ ఎక్స్‌పో అమెరికా (న్యూయార్క్), హాంగ్ కాంగ్ బుక్ ఫెయిర్ (హాంగ్‌కాంగ్), ది లండన్ బుక్ ఫెయిర్ (ఇంగ్లండ్) కూడా చెప్పుకోదగినవే.

ఇప్పటి వరకు మనం చెప్పుకున్న పుస్తక మహోత్సవాలన్నీ... సుదీర్ఘకాలంగా నిరాటంకంగా కొనసాగుతున్నవే కాక కొత్త హంగులతో అంతకంతకు విస్తరిస్తున్నాయి కూడా. 84 స్టాళ్లతో 1989లో ప్రారంభమైన విజయవాడ బుక్ ఫెయిర్ ఇవాళ 375 స్టాళ్లకు విస్తరించింది. కేవలం 15 స్టాళ్లతో సిటీ సెంట్రల్ లైబ్రరీలో ప్రారంభమైన హైదరాబాద్ బుక్ ఫెస్టివల్ ఈ ఏడాది ఎన్టీఆర్ స్టేడియంలో 325 స్టాళ్లతో పుస్తకాల పండుగై పోయింది. టీవీలు, చానళ్లు, సీరియళ్లు, కిండిళ్లు, ఈ పుస్తకాలు...ఎన్ని వచ్చినా పుస్తకానికి ఆదరణ తగ్గలేదనడానికివే సాక్ష్యాలు. కందుకూరి వీరేశలింగం చెప్పినట్టు చిరిగిన చొక్కా తొడుక్కున్నా కొత్త పుస్తకం కొనుక్కోవాలని కోరుకునే అక్షర ప్రేమికులు వున్నంత కాలం పుస్తకం చిరంజీవిగా ఇలా వేడుకలతో వెలిగిపోతుంది మరి!

అభిప్రాయాల సేకరణ: **సాంత్వన్**

తెలుగు పుస్తకానికి మంచి ఆదరణ



మేము సుమారు 20 భారతీయ భాషల్లో పుస్తకాలను ప్రచురిస్తున్నాము. అందులో ప్రముఖంగా తెలుగు పుస్తకానికి మంచి ఆదరణ ఉంది. డిజిటల్ మాధ్యమాల్లో వస్తున్న తెలుగు పుస్తకాలకు అంతగా ఆదరణ లేదనేది నా భావన. డిజిటలైజ్ పుస్తకాలను పూర్తిగా వాడుకులో తెచ్చే నైపుణ్యాలు మన దగ్గర లేవు. బాధాకరమైన అంశం ఏమిటంటే ఒక రచయిత, తన రచనల ద్వారా జీవనం సాగించే పరిస్థితి నేడు లేదు. నేటి సమాజానికి ప్రగతిశీల సాహిత్యం అవసరం చాలా ఉంది. పుస్తకాలు చదివితే ప్రజలు చైతన్యవంతులవుతారు. అందువల్ల మంచి సాహిత్యాన్ని , పుస్తక పఠనాన్ని ప్రోత్సహించకూడదు అన్న భావనల్ని ప్రభుత్వాలు విడనాడాలి.

– విజయకుమార్, ఎమెస్కో పబ్లికేషన్స్

పుస్తక ప్రియుల పాదయాత్ర

రచయితకు, పాఠకుడ్ని దగ్గరచేసే గొప్ప ప్రయత్నం పుస్తక ప్రదర్శన. మిగతా రోజుల్లో దొరకని పుస్తకాలు ఈ సమయంలో దొరికే అవ కాశం ఉంటుంది. పబ్లిషర్స్‌కు కూడా పాఠ కుల నుండి పుస్తకాలకు సంబంధించిన కొత్త విషయాలు తెలుస్తుంటాయి. పుస్తక స్టాళ్లతో పాటు పిల్లలకు ఆటలపోటీలు, బొమ్మలు గీయడం, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందచేస్తాము. రచయితల శతజయంతి వేడుకలు ఈసారి ప్రత్యేకంగా నిర్వహిస్తున్నాము. ప్రతి ఏడాది లాగే ఈ ఏడు కూడా జనవరి 4 నాడు పుస్తక ప్రియుల పాద యాత్ర ఉంటుంది.

–ఎస్. రామారావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటి ప్రెసిడెంట్, వి.వి పబ్లికేషన్స్.

గొప్ప అనుభూతి

నేను ప్రతి సారి క్రమం తప్పకుండా పుస్తక ప్రదర్శ నకు వెళతాను. రకరకాల పాఠకులు, రచయితలు పరిచయమవుతుంటారు. వారితో మాట్లాడు తుంటే నాకు గొప్ప అనుభూతి కలుగుతుంది. పుస్తకాలు చదివేవారి సంఖ్య తగ్గుతుంది అంటే అందుకు నేను అంగీకరించను. ఎవరికి వారు, వారి అభిరుచిని బట్టి పుస్తకాలను చదువుతు న్నారు. సాహిత్యాన్ని చదివేవారున్నారు. వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు చదివేవారున్నారు. అయితే అది వారిని ఎలా ప్రభావితం చేస్తుందనేదే ప్రశ్న. నిజానికి గతం కంటే ఇప్పుడే పుస్తక ప్రియులు పెరిగారని నా భావన.

పి. సత్యవతి, రచయిత్రి.

అది చదివేవారి తప్పు కాదు

పుస్తకం మనిషిని చాలా ప్రభావితం చేస్తుంది. మనం పుస్తకం చదవటమే కాదు, ఎలాంటి పుస్తకం చదువు తున్నామన్న స్పృహ కూడా ఉండాలి. ఈ రోజు యువతను ఆకర్షించడం కోసం కొంత మంది రచయితలు వ్యక్తిత్వ వికాసం పేరుమీద రకరకాల పుస్తకాలు రాస్తున్నారు. వాటిని చదవడానికి యువ తకూడా మక్కువ చూపుతోంది. అది చదివేవారి తప్పు కాదు. రాసేవారు కొంచెం వ్యాపారధోరణితో కాకుండా వాస్తవ దృక్పథంతో రాయాలి. నేటి సామాజిక సమస్యలను ఎకరువు పెట్టే రచనలు రావాలి. వాటిని తప్పకుండా ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకం నాకుంది.

– గీతా రామస్వామి, హైద్రాబాద్ బుక్ ట్రస్ట్.

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

(భాగం -17)

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

బ్రసెల్స్, 1848

జర్మన్ వర్కర్స్ యూనియన్ నిర్వహించిన కొత్త సంవత్సరం వేడుకల్లో పాల్గొన్నారు మార్క్స్, జెన్నీ. (వీటి నిర్వహణలో జెన్నీ కూడా పాలు పంచుకుంది). ఇటీవల ఆమె జీవితంలో సంతోషమే లేకుండా పోయింది. భర్త గురించి ఎప్పుడూ బెంగే. దీనికి తోడు మార్క్స్ లండన్‌లో ఉన్నప్పుడు ఇంట్లో అందరూ మంచం పట్టారు. తను పద్నాలుగు రోజులు లేవలేదు. కొత్త సంవత్సరం నాటికి పరిస్థితి కాస్త మెరుగు పడింది. పిల్లలు కోలుకున్నారు. ఆర్థిక పరిస్థితి కూడా ఆశాజనకంగా కనిపించింది. మార్క్స్ తల్లి ఆస్తిలో కొంత వాటా ఇచ్చేస్తానంది.

అలా డిసెంబర్ 31 నాడు, విప్లవానికి కాసేపు విశ్రాంతి నిచ్చి అందరూ ఉల్లాసంగా గడిపారు. అనేక సంవత్సరాల తర్వాత, మళ్లీ బాల్ డాన్స్ చేసింది జెన్నీ. ఆ సాయంత్రం అదో రంగుల ప్రపంచం. ఊదా, పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల సిల్కు గౌనులు, వేడుక హాల్లోని గ్యాసులైట్ల వెలుగులో తళుక్కుమన్నాయి. నాట్యం మధ్యలోనే కొందరు ఉపన్యాసాలిచ్చారు. బెల్జియం రాజ్యాంగం ఉదారవాద భావాలను, స్వేచ్ఛను సమర్థిస్తోంది. ఈ నేలలో మానవత్వ బీజం మొక్కగా ఎదుగుతోంది అన్నాడు మార్క్స్. జెన్నీ నాటక ప్రదర్శనలో పాల్గొంది. రాత్రంతా కొనసాగింది ఉత్సవం.

మార్క్స్ ఆ రోజు నాట్యంలో పాల్గొని తనకందులో ప్రవేశం ఉందని నిరూపించుకున్నాడు. దంపతులిద్దరూ కలసి చేసిన నాట్యం చాలా మందిని ఆకర్షించింది. రైన్‌లాండ్‌లో ఇలాంటి సందర్భాల్లో, ఉన్నత వర్గాల వాళ్లూ, కార్మికులూ దూరదూరంగా ఉండాలని మధ్యలో ఓ తాడు కడతారు. ఇక్కడ అలాంటి విభజన లేదు.

పెళ్లయిన నాటి నుండీ జెన్నీని ఆర్థిక అభద్రతా భావం వెంటాడుతూనే ఉంది. దానితో పాటు స్వదేశానికి దూరంగా ఉండటం మరో బెంగ. పిల్లల అనారోగ్యం, భర్త అనుభవిస్తున్న రాజకీయ వేధింపులు కూడా ఆమెను కుంగతీశాయి. అయినా ఆ సాయంత్రం ఆమె ఆనందానికి అవేమీ అడ్డు రాలేదు. తానింకా పెళ్లికాని పద్దెనిమిదేళ్ల అరిస్టోక్రాటిక్ యువతి అన్నట్టుగానే రీవి ప్రదర్శించింది.

ఆ నాట్యానికి మేరీబర్న్సును వెంట తీసుకొచ్చాడు ఎంగెల్స్. అందరూ ఉల్లాసంగానే ఉన్నా, ఆమెకూ, జెన్నీకి వున్న వ్యత్యాసం స్పష్టంగా కనిపించింది. "జెన్నీకి అసలామెను పలకరించే ఉద్దేశమే లేదని మార్క్స్ చెప్పాడు" అన్నాడు స్టెఫాన్ బార్న్ (కమ్యూనిస్ట్ లీగ్ సభ్యుడు). అయితే ఇది జెన్నీ అహంకారం కాకపోవచ్చు. అంతమంది పేదవాళ్ల మధ్యకు తను పెళ్లి చేసుకోని స్త్రీని తీసుకురావటం వాళ్లకు నచ్చి ఉండకపోవచ్చు. ధనికులు పేద ఆడపిల్లల్ని ఆటవస్తువుల్లా వాడుకుంటున్నారని అనుకుంటారు వాళ్లు.

జనవరిలో 'మేనిఫెస్టో' రచన పూర్తి చెయ్యటానికి మార్క్సును ఒంటరిగా వదిలింది జెన్నీ. అప్పటికే మూడు ముసాయిదాలు పూర్తయ్యాయి. రెండు ఎంగెల్స్, ఒకటి హెస్ రాశారు. అవేవీ తృప్తి నివ్వలేదు మార్క్సుకు. 'మళ్లీ రాయాల్సిందే అనుకున్నాడు. పని తొందరగా ముగియటానికి, జెన్నీ సహాయం చేస్తానంది. మార్క్స్ తన గజిబిజి రాత కొనసాగించాడు. దాన్ని జెన్నీ అందమైన దస్తూరితో తిరగరాసింది. బూర్జువా వర్గాన్ని అంతగా అభిశంసించిన రచన చరిత్రలో మరొకటి లేదు. విప్లవం అనివార్యం అన్నారు. కావచ్చు కాని, ఎప్పటిలాగే పని పూర్తి చెయ్యటానికి మార్క్సుకు మరెన్నో పనులు అడ్డుపడ్డాయి. 'డాయిష్ బ్రసెలర్'కు వ్యాసాలు రాయాలి. 'జర్మన్ వర్కర్స్ యూనియన్' కోసం ఉపన్యాసాలు తయారు చెయ్యాలి (వీటిని పుస్తకంగా సంకలనం చెయ్యాలనుకున్నాడు). ఇంటర్నేషనల్ డెమోక్రాటిక్ అసోసియేషన్ సమావేశాలకు హాజరు కావాలి (ఇందులో భాగంగా బెల్జియంలోని పారిశ్రామిక నగరం ఘెంట్‌లో కూడా అసోసియేషన్ శాఖను ప్రారంభించాలి). వాటితో పాటు జనవరిలో, స్వేచ్ఛా వాణిజ్యం గురించి కూడా ఉపన్యసించాడు.

స్వేచ్ఛా వాణిజ్యం రాజరికంలాగా సహజమైంది అంటారు కొందరు. (వాళ్ల దైవాంశ సంభూతులు. అది దైవాజ్ఞ) వాణిజ్యం వల్ల జనం మధ్య దూరం తగ్గుతుంది. సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒక చరిత్రకారుడు చెప్పినట్టుగా "నాగరికత అందించిన వరాలు అందరికీ అందుతాయి". కాని "పెట్టుబడికి స్వేచ్ఛ ఇవ్వటమంటే, కార్మికులను అణచి వెయ్యటానికి స్వేచ్ఛ యివ్వటమే" అన్నాడు మార్క్స్. అయితే ఒకరకంగా ఇది అభిలషణీయమే. పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. సామాజిక మార్పు వేగవంతమవుతుంది. ప్రపంచం – ధనిక బూర్జువా – కార్మిక వర్గాలుగా చీలిపోతుంది. ("వారసత్వంగా వచ్చిన సంపద ఒకవైపు – వారసత్వంగా వచ్చిన పేదరికం ఒకవైపు" అన్నాడు ఎంగెల్స్) స్వేచ్ఛావాణిజ్యంతో ప్రస్తుత వ్యవస్థ తొందరగా అదుపు తప్పుతుంది. ఆర్థిక సంక్షోభం తలెత్తుతుంది. విప్లవం అనివార్యం అవుతుంది.

కార్మికులకు శాపం లాంటి స్వేచ్ఛా

వాణిజ్యాన్ని వ్యతిరేకించటానికి బదులు, ఆహ్వానించినందుకు కొందరు మార్క్సును తప్పు పట్టారు. కాని అపరిపక్వ దశలో విప్లవం సఫలం కాదు అన్నాడు మార్క్స్. కొద్దిమంది కాదు, అధిక సంఖ్యాకులు విప్లవ ఆవశ్యకతను గుర్తించినప్పుడే దానికి దారి సుగమం అవుతుంది (స్వేచ్ఛా వాణిజ్యం వల్ల ఈ మార్పులన్నీ త్వరితగతిన సంభవిస్తాయి). హింస ద్వారా అధికారం హస్తగతమవుతుందేమోగాని కార్మిక వర్గ ప్రయోజనాలు నెరవేరవు.

మార్క్స్ తన స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతాన్ని బ్రసెల్స్‌లోని ఆర్థికవేత్తలకు సెప్టెంబర్‌లో వినిపిద్దామనుకున్నాడు గాని వీలుపడలేదు. అయితే, అది వృథాగా పోలేదు. 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో'లో అది ప్రతిఫలించింది.

పారిస్‌లో ఉన్న ఎంగెల్స్, అక్కడి లీగ్ సభ్యులు సంస్థ కార్యకలాపాలలో ఉత్సాహం చూపటం లేదని రాశాడు. దానికి కారణం, లండన్ సమావేశాలు తాము ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడమే. యూరోపియన్ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్నా లండన్ సమావేశాల్లో అవి ప్రతిఫలించలేదు. అప్పటికే 'మేనిఫెస్టో' రచించబోతున్న మార్క్స్‌కు ఇదో హెచ్చరికలా పని చేసింది. ఇది సరిపోదన్నట్టు, ఫిబ్రవరి 2 నాటికి మేనిఫెస్టో తమకు చేరకపోతే, "మీ మీద తదుపరి చర్యలు తీసుకోబడతాయి" అంటూ జనవరి 26 నాడు ఒక అల్టిమేటం పంపింది లీగ్ ."

నిజానికి మార్క్స్ అప్పటికే రచన ముగించాడు. జనవరి చివరలో ఈ 23 పేజీల డాక్యుమెంట్‌ని లండన్‌కు పోస్టు చేశాడు. లండన్ నగరంలోని లివర్‌పూల్ స్ట్రీట్‌లో ఉన్న జె.ఇ.బర్గర్ అనబడే జర్మన్ ప్రింటర్ ముదురు ఆకుపచ్చరంగు కవర్‌తో దాన్ని ముద్రించారు. పేరు " మేనిఫెస్టో ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ" (అప్పటి వరకూ ఆ పేరుతో ఏ పార్టీ లేదు) ఫిబ్రవరి 1848 నాటికి ఎనిమిది వందల ప్రతులు అచ్చయ్యాయి. పుస్తకం మీద రచయిత పేరు కనిపించదు. ఇంగ్లీష్ చార్టిస్ట్ నాయకుడు జార్జి జూలియన్ హార్నీ దీన్ని "ప్రపంచంలోని అత్యంత విప్లవాత్మక డాక్యుమెంట్" అన్నాడు.

'మేనిఫెస్టో' రచనలో గొప్ప బిగువు వుంటుంది. పైకి ప్రశాంతంగా కనిపించినా అడుగున బడబాగ్నులు దాగున్నాయనిపిస్తుంది. మొదటి వాక్యమే – కోర్టులో కేసు వాదిస్తున్నట్టుగా ప్రారంభమవుతుంది (ఒకప్పుడు మార్క్స్ లాయర్ కావాలనుకున్నాడు) "యూరోప్‌ను ఒక భూతం ఆవహించింది. కమ్యూనిస్టు భూతం"

ఆ తర్వాత బూర్జువా వర్గం చేసిన నేరాలను ఒకటొకటిగా వర్ణిస్తాడు. "స్వప్రయోజనం, స్వార్థం, డబ్బు యివ్వటం, తీసుకోవటం తప్ప మనిషికీ మనిషికీ మధ్య మరే సంబంధమూ లేకుండా పోయింది. "డాక్టర్లు, లాయర్లు, ప్రీస్టులు, కవులు, శాస్త్రజ్ఞులు వంటి గౌరవప్రదమైన వృత్తుల వాళ్లను కూడా, కేవలం డబ్బుల కోసం పనిచేసే కూలీలుగా

"'మేనిఫెస్టో' రచనలో గొప్ప బిగువు వుంటుంది. పైకి ప్రశాంతంగా కనిపించినా అడుగున బడబాగ్నులు దాగున్నాయనిపిస్తుంది. మొదటి వాక్యమే - కోర్టులో కేసు వాదిస్తున్నట్టుగా ప్రారంభమవుతుంది (ఒకప్పుడు మార్క్స్ లాయర్ కావాలనుకున్నాడు) "యూరోప్‌ను ఒక భూతం ఆవహించింది. కమ్యూనిస్టు భూతం" ఆ తర్వాత బూర్జువా వర్గం చేసిన నేరాలను ఒకటొకటిగా వర్ణిస్తాడు. "స్వప్రయోజనం, స్వార్థం, డబ్బు యివ్వటం, తీసుకోవటం తప్ప మనిషికీ మనిషికీ మధ్య మరే సంబంధమూ లేకుండా పోయింది. "

మార్చింది. కుటుంబ సంబంధాలను ఆర్థిక సంబంధాలుగా మార్చింది. "పెట్టుబడి సృష్టించిన ఈ సంక్షోభం ప్రపంచంలోనే అపూర్వం. ఉత్పత్తి విధానాలను విప్లవీకరించి, తద్వారా అదనపు లాభాలను మూటగట్టుకోవాలనుకోవడమే దీనికి కారణం – లాభాలు రావాలంటే వాణిజ్యం ప్రపంచమంతా విస్తరించాలి. అంటే వాణిజ్యం జరగని చోటంటూ ఎక్కడా ఉండకూడదు. ఈ పద్ధతిలో దూరదేశాల ముడిసరుకులు స్టీం షిప్పుల్లో, రైళ్లలో పరిశ్రమలకు చేరాయి. పాతతరం జాతీయ పరిశ్రమలు నాశనమయ్యాయి. పారిశ్రామిక సాలెగూడులో చిక్కుకున్న పాత నాగరికతలు కూడా కనుమరుగైనాయి. దీన్ని గురించి మార్క్స్ సంక్షిప్తంగా "ఈ వ్యవస్థ తన రూపంలో కొన్ని పున: నిర్మించుకుంటుంది" అన్నాడు.

"అంతేకాదు సమాజం విధ్వంస బీజాలను కూడా తనలోనే నిక్షిప్తం చేసుకుంది. క్షుద్రశక్తులను ఆవాహన చేస్తే అవి ఆ మంత్రగాణ్ణే కబళించినట్టుగా" అని కూడా వివరించాడు. వ్యాపార సంక్షోభాలు ఉత్పత్తిని అనివార్యంగా పెంచుతాయి. ఈ పారిశ్రామిక అభివృద్ధికి కారణమైన కార్మిక సైన్యమే కొత్త వ్యవస్థను తుదముట్టిస్తుంది. అందువల్ల బూర్జువా వర్గం ఇతర వస్తువులను ఎన్ని ఉత్పత్తి చేసినా, అన్నింటి కన్నా ముఖ్యంగా అది తన సమాధి తవ్వేవాళ్లను ఉత్పత్తి చేస్తుంది. "బూర్జువా వ్యవస్థ పతనం – కార్మికవర్గ విజయం అనివార్యం" చారిత్రక పరిణామ క్రమంలో ఇది తప్పనిసరి" అన్నాడు మార్క్స్.

కమ్యూనిజానికి ప్రాతిపదిక సొంత ఆస్తిని నిషేధించటమే. కొందరు విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తే : పదింట తొమ్మిది మందికి ఏ ఆస్తీ లేదు. అందువల్ల పోగొట్టుకునే వాళ్లు ఎవరైనా ఉన్నారంటే, అదంతా వాళ్లుదోపిడీ చేసి సంపాదించిందే" అని వివరణ ఇచ్చాడు. "సమాజంలోని వనరుల మీద అందరికీ హక్కు కల్పిస్తుంది కమ్యూనిజం. ఈ విషయంలో ఎవరి పట్లా వివక్ష చూపదు. కాకపోతే శ్రమ దోపిడీని అది అరికడుతుంది. ఎవరికీ మరొకరి శ్రమ మీద అధికారముండదు. వందమందో, లక్షమందో కలిసి ఒక పరిశ్రమలో సంపద సృష్టిస్తే ఆ లాభమంతా కొద్దిమందికి మాత్రమే ఎందుకు దక్కుతుంది? ప్రకృతి మానవునికి ప్రసాదించిన వరాలు...ప్రకృతి వనరులు, ఖనిజాలు, సముద్రాలు ఇలాంటివన్నీ కొద్ది మంది ఆధీనంలో ఎందుకుండాలి?"

"కుటుంబ వ్యవస్థకే ప్రమాదకరంగా పరిణమిస్తుంది కమ్యూనిజం" అని విమర్శించేవాళ్లవి ద్వంద్వ విలువలన్నాడు మార్క్స్. "ఇప్పటికే బూర్జువా పారిశ్రామిక వ్యవస్థలో బాల కార్మికులు బాల్యాన్ని కోల్పోతున్నారు. విద్యాబుద్ధులకు దూరం చేసి, వాళ్లను కేవలం వ్యాపార సరుకుగా, వాళ్ళ శ్రమను దోపిడీ చెయ్యటానికి మాత్రమే వాడుకుంటున్నారు". ఇక, ధనికవర్గాలు వైవాహిక వ్యవస్థను ఇప్పటికే నాశనం చేశాయి. పేదల భార్యలనూ, కూతుళ్లనూ డబ్బాశ చూపి, పడుపు కత్తెలుగా మార్చుతున్నారు. ధనిక వర్గాలలో 'భార్యల మార్పిడి' ఒక క్రీడగా మారింది.

"వర్గాలూ, వర్గ వైషమ్యాలతో కుళ్లిపోయిన బూర్జువా సమాజం స్థానంలో కొత్త సమాజాన్ని ఏర్పర్చుకుందాం. అక్కడ ఒకరి బాగు అందరి బాగుగా ఉంటుంది. ఒకరి అభివృద్ధి అందరి అభివృద్ధిగా వుంటుంది." కాని ప్రస్తుత సామాజిక వ్యవస్థను "బల ప్రయోగంతో కూల్చినప్పుడే ఇది సాధ్యపడుతుంది. కమ్యూనిస్టు విప్లవ గర్జనకు అధికార వర్గాలు గజగజా వణకనీ!" కార్మికులు పోగొట్టుకునేదేమీ లేదు. వాళ్లకున్న సంకెళ్ల తప్ప. నూతన ప్రపంచాన్ని తప్పక గెలుచుకుంటారు!

"ప్రపంచ కార్మికులారా, ఏకం కండి!"

సశేషం

▪ ఫోన్: 91776 18708

విస్తరిస్తున్న అమెరికా జైళ్ల పరిశ్రమ

తాను తప్ప ఇతరులందరూ దొంగలే అని ఎవరు భావిస్తారంటే ఫ్యాక్టరీ, భూ, దుకాణ, కార్యాలయ యజమానులని ఎవరైనా ఇట్టే చెబుతారు. అందుకే పని స్థలాల్లో ఎప్పుడూ ఒక కన్నేసి ఉంచుతారు. దోపిడీ సమాజంలో పనికి తగ్గ ప్రతిఫలం ఇవ్వటం లేదని యజమానులకు అంతర్గతంగా తెలుసుకనుకనే తన దగ్గర పనిచేసే వారిని శ్రామికులుగా చూడటానికి బదులు నేరగాళ్లుగా చూస్తారు. ఎవరైనా అలా చూడటం లేదంటే ఎప్పుడైనా కొన్ని మినహాయింపులు ఉండవచ్చు గానీ అది వర్గలక్షణం.

తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు అన్నట్లుగా పెట్టుబడిదారులు జైళ్ల పరిశ్రమ ద్వారా కూడా లాభాలు గడించవచ్చని నిరూపించారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రపంచ కేంద్రమైన అమెరికాలో అక్కడి ప్రభుత్వం పౌరులందరిపై పోలీసు రికార్డులను నిర్వహించటం ద్వారా ప్రతి ముగ్గురిలో ఒకరిని నేరగాళ్లుగా చూస్తున్నది. ఎక్కువ భాగం చిన్న చిన్న నేరాలే అవి. సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన కారణంగా ఇప్పుడు ఆ రికార్డులు పౌరులకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అనేక మందిని కొత్త నేరాలకు ప్రోత్సహిస్తున్నాయి. ఈ కారణంగానే న్యూయార్క్ నగర వామపక్ష మేయర్ డి బ్లాసియో ఒక కొత్త బిల్లును ప్రతిపాదించారు. అది అమలులోకి వస్తే ఉద్యోగ దరఖాస్తులలో క్రిమినల్ రికార్డుల గురించి రాయాల్సిన అవసరం ఉండదు. ఈ ప్రతిపాదన రాగానే యజమానులు ఇంకేముందంటూ గుండెలు బాదుకుంటున్నారు. అసలు నమ్మలేని నిజం ఏమంటే అలాంటి పోలీసు రికార్డులు అక్కడి యువతను సంస్కరించటానికి ఏమాత్రం ఉపయోగపడలేదు. ఒక చిన్న నేరం చేసినంత మాత్రాన అది జీవితకాలం ఉద్యోగం చేయటానికి లేదా అద్దె ఇళ్లలో ఉండటానికి ఆటంకం కావాలా అని బిల్లును రూపొందించిన జుమానే విలియమ్స్ ప్రశ్నించారు. ఏంజల్ గైరిడ్డో అనే వ్యక్తి 20 సంవత్సరాలు జైలులో ఉండి వచ్చాడు. తన 14 సంవత్సరాల తమ్ముడిపై దాడి చేసి కుటుంబాన్ని బెదిరించిన ఒక ముఠాలో ఒకడిని మట్టుబెట్టిన కేసులో శిక్ష పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే జైలు శిక్ష అనుభవించినట్లు దరఖాస్తులో రాయాల్సి వస్తున్నందున తనకు ఉద్యోగం ఇవ్వటం లేదని బిల్లుపై విచారణ సందర్భంగా చెప్పాడు. అతను గత మూడు సంవత్సరాలుగా నిరుద్యోగిగా ఉన్నాడు. ప్రతి చిన్న నేరాన్ని కూడా పోలీసు రికార్డులకు ఎక్కిస్తుండటంతో యజమానులు ఆ సాకు చూపి ఉద్యోగాలను నిరాకరించటం ముఖ్యంగా రంగు, నల్లజాతీయుల పట్ల వివక్ష చూపుతున్నారు.

అమెరికాలో ప్రస్తుతం ఏడు నుంచి పదికోట్ల మందిపై పోలీసు క్రిమినల్ రికార్డులు ఉన్నాయి. శిక్షలు పడకుండానే అరెస్టయిన వారున్నారు. ఇలాంటి వారికి ఉద్యోగాలు నిరాకరిస్తున్న కారణంగా అనేక పర్యవసానాలు ఎదురవుతున్నాయి. ప్రతి చిన్న నేరానికి జైలు పాలు చేయటం, క్రిమినల్ రికార్డులలోకి ఎక్కించని పక్షంలో 1980-2004 మధ్య దారిద్ర్యం 20శాతం తగ్గి ఉండేదని తాజాగా ఒక విశ్లేషణ వెల్లడించింది. రెడ్ ఇండియన్లు, నల్లజాతీయులను అణచివేసేందుకు ప్రతి చిన్న తప్పును పెద్ద అపరాధంగా పరిగణించే జిమ్ క్రో చట్టాలు 1877 నుంచి 1960 దశకం వరకు అమలు జరిగాయి. ఆ తరువాత కూడా వాటి కొనసాగింపు మరో రూపంలో జరుగుతోంది. అందుకే ప్రపంచంలో ఏ దేశంలో లేనంతగా అక్కడ జైలు పక్షులు ప్రతి లక్షమందికి 716 మంది ఉన్నారు. ప్రపంచ జనాభాలో అమెరికన్లు ఐదుశాతమైతే ఖైదీలలో 25శాతం ఉన్నారు. ముఖ్యంగా 1980 దశకం నుంచి జైలు పాలయ్యే వారు విపరీతంగా పెరిగారు. అక్కడి 23లక్షల మంది ఖైదీలకు ఏడాదికి ఒక్కొక్కరికి 24వేల డాలర్ల చొప్పున ఖర్చు అవుతోంది. కొత్తగా జైలు కట్టాలంటే 501 కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నారు.

చీటికీ మాటికీ జనాన్ని జైలు పాలు చేస్తుండటంతో 1980 దశకంలో రోనాల్డ్ రీగన్ సర్కార్ జైళ్లను ప్రయివేటీకరించింది. దాంతో ప్రయివేటు కంపెనీల లాభాలను పెంచటం కోసం ఏదో ఒకసాకుతో జైల్లో వేసే వారి సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. జనాన్ని జైళ్లకు పంపటంలో ప్రయివేటు కంపెనీలు-ప్రాసిక్యూటర్లు-పోలీసులు కుమ్మక్కు అవుతున్నారు. లాభాల కోసం పనిచేసే ప్రయివేటు జైళ్ల పరిశ్రమ సామూహిక ఖైదుకు ప్రధాన కారణంగా ఉన్నట్లు 2011లో ఒక నివేదిక వెల్లడించింది. ఇలాంటి జైళ్లలో ఖైదీల సంఖ 44శాతం పెరిగినట్లు బ్లూమ్‌బెర్గ్ 2013లో వెల్లడించింది. తమ జైళ్లలో కనీసం 90శాతం గదులు ఎప్పుడూ ఖాళీగా ఉండకూడదని రెండు కార్పొరేట్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. ఒక వేళ ఏ రాష్ట్రమైనా అంతకు తక్కువగా ఖైదీలను లాకప్పులకు పంపకపోతే ఖాళీ గదులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

క్రిమినల్ రికార్డుల కారణంగా నిరుద్యోగులు తయారవుతున్న కారణంగా ఏడాదికి జిడిపికి 6500 కోట్ల డాలర్ల నష్టం వస్తోందని అంచనా. జైళ్ల ఖర్చు ఎనిమిదివేల కోట్ల డాలర్లు ఖర్చు అదనం. మార్పు వాగ్దానంతో అధికారానికి వచ్చిన ఒబామా పాత విధానల కొనసాగింపు తప్ప మార్పులేదు. తప్పుదారి పట్టిన యువతీ, యువకులు సంస్కరించాల్సిన పోలీసు రికార్డులు వారిని మరిన్ని నేరాలు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నాయి.

- సత్య

అరటితో అదుర్స్

అరటికాయ 65

కావలసినవి: అరటికాయ ఒకటి, మైదా-టీ స్పూను, కార్న్‌ఫ్లోర్- టీ స్పూను, శనగపిండి-టీ స్పూను, ఉప్పు-తగినంత, కారం- అర టీ స్పూను, పసుపు-అర టీ స్పూను, పచ్చిమిర్చి తరుగు-4, ఉల్లితరుగు-అరకప్పు, కరవేపాకు-నాలుగు రెమ్మలు, అల్లం వెల్లుల్లి ముద్ద-అర టీ స్పూను, నూనె-పావు కిలో, పెరుగు-అర కప్పు, నీరు -తగినంత.

తయారు చేసే విధానం: ముందుగా అరటికాయ చెక్కు తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి (తరిగిన ఈ ముక్కలను మజ్జిగ కలిపిన నీటిలో వేస్తే నల్లబడకుండా ఉంటాయి). స్టౌ మీద బాణలి పెట్టి, అందులో నూనె పోసి వేడి చేయాలి. నూనె కాగేలోపుగా ..ఒక బౌల్ తీసుకుని అందులో మైదా, కార్న్‌ఫ్లోర్, శనగపిండి, కారం, పసుపు,ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో తరిగి ఉంచుకున్న అరటికాయ ముక్కలను కలపాలి. వీటిని పకోడీల మాదిరిగా నూనెలో వేసి వేయించాలి. అలా వేయించిన వాటిని పక్కన పెట్టుకోవాలి. మరొక బాణలిలో నాలుగు స్పూన్ల నూనె వేసి కొద్దిగా వేడయ్యాక ఉల్లితరుగు,అల్లంవెల్లుల్లి ముద్ద, పచ్చిమిర్చి తరుగు కరివేపాకు వేసి వేయించాలి. బాగా వేగాక అందులో ఒక కప్పు పెరుగు తగినంత నీరు పోయాలి, నీరు బాగా దగ్గరపడిన తరువాత అందులో పక్కన పెట్టుకున్న బజ్జీలను వేసి కలిపి ఐదు నిమిషాల తరువాత దింపేయాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి.

అరటికాయ పకోడి



కావలసినవి: అరటికాయ -ఒకటి, శగనపిండి-100 గ్రా, పసుపు-అర టీ స్పూను, కారం పొడి- అర టీ స్పూను, ధనియాల పొడి-అర టీ స్పూను, ఉప్పు - తగినంత, నీరు - తగినంత , అల్లం వెల్లుల్లి ముద్ద- అర టీ స్పూను, పచ్చిమిర్చి-6, కరివేపాకు-రెండు రెమ్మలు, నూనె-250 గ్రా,

తయారు చేసే విధానం: ముందుగా అరటికాయ చెక్కు తీసి తురుముకోవాలి. ఒక గిన్నెలో పైన చెప్పిన పదార్థాలను (నూనె కాకుండా) వేసి బాగా కలపాలి. అందులో అరటి తురుము వేసి బాగా కలపాలి. బాణలిలో నూనె పోసి స్టౌ మీద ఉంచాలి. నూనె వేడయ్యాక అందులో ఈ మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేయించుకోవాలి. వీటిని పేపర్ మీదకు తీసుకుని, వేడి వేడిగా సర్వ్ చేయాలి.

అరటి వేపుడు

కావలసినవి:

అరటికాయ- ఒకటి, జీడిపప్పు-50 గ్రా., వేరు శనగ పప్పు (పల్లీలు) -50 గ్రా, చాట్ మసాలా- కొద్దిగా, ఉప్పు-తగినంత, ఉల్లితరుగు-ఒక కప్పు, నిమ్మకాయ-ఒకటి, పచ్చి మిర్చి తరుగు- రెండు టీ స్పూన్లు, కరివేపాకు- రెండు రెమ్మలు,పసుపు -అర టీ స్పూను , కొబ్బరి తురుము- రెండు టీ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు -అర టీ స్పూను, నూనె -5 టీ స్పూన్లు- కొత్తిమీర -ఒక కట్ట.

తయారు చేసే విధానం :

ముందుగా అరటి కాయ చెక్కు తీసి చక్రాలుగా కట్ చేసుకోవాలి. బాణలిలో నాలుగు టీ స్పూన్లు నూనె పోసి స్టౌ మీద ఉంచాలి. నూనె కాగాక ఈ చక్రాలను అందులో వేసి వేయించాలి. మరో బాణలిలో నూనెలేకుండా పల్లీలను వేయించి తీసేశాక ఆ బాణలిలో నే కొద్దిగా నూనె వేసి కాగాక అందులో ఉల్లి తరుగు వేసి గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి. తరువాత అల్లం వెల్లుల్లి ముద్ద వేసి వేగాక , పసుపు , పచ్చిమిర్చి తరుగు ... కరివేపాకు, కొబ్బరి తురుము, వేయించిన పల్లీలు , జీడిపప్పు ఒక దాని తరువాత ఒకటి వేస్తూ బాగా కలపాలి. అన్నీ వేగాక ఈ మిశ్రమాన్ని వేయించి ఉంచుకున్న అరటి చక్రాలను వేసిబాగా కలపాలి, చివరగా ఉప్పు నిమ్మరసం , చాట్ మసాలా వేసి మరో మారు కలిపి, కొత్తిమీరతో గార్నిష్ చేయాలి.

అరటికాయ మసాలా

కావలసినవి: అరటికాయ- ఒకటి , ఉల్లి తరుగు-50గ్రా, నూనె-50 గ్రా,పల్లీలు-100 గ్రా, జీడిపప్పు-50 గ్రా., నువ్వులు-50 గ్రా. ఎండుకొబ్బరి-50 గ్రా, గసగసాలు-అర టీ స్పూను, టామాటాలు -4, పసుపు-కొద్దిగా, అల్లంవెల్లుల్లి ముద్ద-టీ స్పూను, కారంపొడి- టీ స్పూను, ధనియాల పొడి-టీ స్పూను, పచ్చిమిర్చి-6, కరివేపాకు- రెండు రెమ్మలు

తయారు చేసే విధానం : ముందుగా అరటికాయ చెక్కు తీసి ముక్కలుగా కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. జీడిపప్పు, ఎండుకొబ్బరి, గసగసాలు , పల్లీలు నువ్వులు మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఒక బాణలి తీసుకుని అందులో నూనె వేసి వేడయ్యాక ఉల్లిపాయల ముక్కలు వేసి దోరగా వేగాక అల్లం వెల్లుల్లి పేస్టు వేసి తరువాత అందులో గ్రైండ్ చేసిన మసాలా వేయాలి. ఐదు నిమిషాలు వేగిన తరువాత టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు, పసుపు కారంపొడి, ధనియాల పొడి, తగినంత ఉప్పు, తగినంత నీరు పోసి కొద్దిసేపు ఉడకపెట్టాలి, చివరగా అరటికాయ ముక్కలను ఇందులో వేసి ఐదు నిమిషాలు ఉంచాలి. చివరగా కొత్తిమీర వేసి దించేయాలి.

ఏది...ఎన్నిసార్లు వచ్చింది?



హాయ్ చిన్నారులూ... ఇవాళ మీ ముందుకు ఒక పజిల్ తీసుకొచ్చాం. చూశారుగా. ఇందులో 4 చిహ్నాలున్నాయి. త్రిభుజం, వృత్తం, చతురస్రం, దీర్ఘచతురస్రం. అయితే ఒక్కో గుర్తు చాలా సార్లు వచ్చింది. ఏ గుర్తు ఎన్నిచోట్ల వుందో లెక్కించి చెప్పాలన్నమాట. మరి చకచకా ఆ పని పూర్తిచేసేయండి.

ఏమేం వున్నాయి?



నేస్తాలూ... ఈ బొమ్మను పరిశీలనగా చూడండి. వస్తువులు, తినుబండారాలు చాలానే వున్నాయికదా. అయితే మొత్తం ఎన్ని? ఇందులో తినేవి ఎన్ని? వస్తువులు ఎన్ని? లెక్కించి చెప్పాలి.

తేడాలు చెప్పకోండి



ఈ రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నాయి కదా. కానీ వాటిలో ఆరు తేడాలున్నాయి. కనిపెట్టండి చూద్దాం.

జడబిళ్లల కోసం...

మనం రకరకాల జడ క్లిప్పులు కొనుక్కుంటూ ఉంటాం. తీరా ఏదైనా ఫంక్షన్‌కి వెళ్లే సమయానికి కావాల్సినవి దొరకవు కదూ. మరి వాటిని ఎక్కడెక్కడో వేస్తాం. అవసరమైనప్పుడు చూసుకోవచ్చులే అనుకుంటాం. అలాకాకుండా వాటిని ఒక చోట పెట్టుకునే మార్గమొకటి చూద్దామా? అదేమిటంటే క్లిప్ హోల్డర్‌ను తయారు చేసుకుందాం. ఎంచక్కా దానికి మన కిల్లప్పులన్నీ పెట్టుకోవచ్చు.

కావాల్సిన వస్తువులు:

గట్టిఅట్ట, కత్తెర, మార్కర్, ఊలు, గమ్.

తయారుచేసే విధానం:

ముందుగా గట్టి అట్టను తీసుకుని నాలుగు అంగుళాల వ్యాసార్థంతో వృత్తాకారంలో కత్తిరించాలి. అది క్లిప్ హోల్డర్ మొహం అన్నమాట. దాని మీద కళ్లు, ముక్కు, పెదాలు.... వంటి వాటితో చిరునవ్వులు చిందిస్తున్న బొమ్మను మార్కర్‌తో గీసుకోవాలి. 20 అంగుళాల పొడవు వుండేట్టు ఆ బొమ్మకు జుట్టులాగా ఊలును కత్తిరించాలి. అదే రంగు ఊలుతో వాటన్నిటినీ ఒక కొసన ముడి వేయాలి. తరువాత వాటిని మనం ఇంతకు ముందు తయారు చేసుకున్న బొమ్మకు జుట్టులా గమ్‌తో అంటించాలి. ఇప్పుడు దాన్ని జడలాగా అల్లుకోవచ్చు. లేదంటే అలా వదిలేయొచ్చు. ఇప్పుడు దానికి మన క్లిప్పులన్నీ పెట్టుకోవచ్చు. మనకెప్పుడు ఏ క్లిప్పు కావాలంటే అప్పుడు వెంటనే తీసుకోవచ్చు. వెతుక్కోవాల్సిన పనే ఉండదు.

◆

ఎవరి నీడ ఏది?



ఎ, బి అనే పేర్లున్న పక్షులు రెండు ఇచ్చాం.
వాటి నీడ పై నున్న బొమ్మల్లో వుంది. ఏదో గుర్తించండి.



ఒంటెకు రంగులు అద్దుదాం

ఒంటెను 'ఎడారి ఓడ' అంటాం. మరి అంత గొప్ప జంతువును ఇలా రంగులు లేకుండా బోసిగా వుంచితే ఏం బావుంటుంది? వేసేద్దామా..

రంగులు. 1. పసుపు, 2.నీలం, 3. నారింజ, 4. తేనె రంగు, 5. ఇటుక రాయి రంగు

గుర్రం బొమ్మ గీద్దాం



కవలలు ఎవరో?



బుజ్జాయిలూ...ఇక్కడ చూడ్డానికి అంతా ఒకేలా కనిపిస్తున్నారా?
కాకపోతే ఇద్దరు మాత్రమే అచ్చు గుద్దినట్టు ఒకేలా వున్నారు.
మరి వారెవరో గుర్తించి చెప్పండి.

◆ **కొత్త పుస్తకాలు**

అన్నీ నిజ జీవిత పాత్రలే

రచయిత వల్లూరి శివప్రసాదు గారి రకరకాల పత్రికల్లో ప్రచురితమైన కథలను 'నాగేటి చాలు' కథాసంపుటిగా ప్రచురించారు విశాలాంధ్ర పబ్లిషర్స్ వారు. ఇందులో మొత్తం 22 కథలున్నాయి. మారిన కాలంతో పరిగెత్తలేక, చతికలపడ్డ వ్యవసాయం, దాన్నే నమ్ముకుని నిత్యం చస్తూ బతుకుతున్న రైతులు, వారి కడగండ్లు, వారిని మోసం చేస్తున్న దళారీలు, వ్యాపారస్థులు .....ఇవే కథా వస్తువులుగా తీసుకొని కర్షకుల జీవితాల్లోని సంఘటనల సంఘర్షనలను కథల రూపంలో మలిచారు రచయిత. కొన్ని కథలు చదువుతుంటే రచయిత సామన్య కుటుంబ జీవనంలోకీ చొరబడ్డారనిపిస్తుంది. ఈ కథల్లో మనకు పరిచయమయ్యే పాత్రలన్నీ గ్రామీణ నిజ జీవితాల్లో మన కళ్లముందు తిరుగుతుండేవే. బూబమ్మ అనే నిరుపేద ముసలవ్వ వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు పడే పాట్లను 1987లోనే 'ఎండమావి' కథగా మలిచాడు రచయిత. పింఛను కోసం నానా తంటాలు పడే బూబమ్మలాంటి వారు నేటికీ మనకు కనినిస్తారు. పురుగుమందుల కంపెనీలు రైతులను ఎలా మోసం చేస్తున్నాయి. వారి ఏజెంట్లుగా పనిచేసే కృష్ణమూర్తి లాంటి వారు మాటల బురిడీతో రైతులను ఎలా తప్పుదోవ పట్టిస్తున్నారు. నాసిరకం పురుగుమందులు వాడి నష్టపోయిన రైతు అమరయ్య తనలాగా నష్టపోయిన రైతులందరికీ ఎలాంటి సందేశాన్నిచ్చాడో 'పురుగు' కథలో చదవచ్చు. పాతకాలపు భోషాణంపై మమకారాన్ని పెంచుకున్న తులశమ్మ, దాన్ని ఇంటిలో అడ్డుగా భావించే కొడుకు, కోడలు. చివరికి ఆ భోషాణం ఏ రూపానికి మారిందో తెలుసుకోవాలంటే 'కొయ్య బొమ్మలు' కథ చదవాల్సిందే. ఈ కథలో వస్తువుల్ని అవసరానికి మాత్రమే వాడుకునే కొత్త తరం. అవసరానికి ఉపయోగపడ్డందుకు వాటిపై



నాగేటి చాలు కథలు, రచన - వల్లూరు శివప్రసాద్, ధర: 140 రూ॥ , పేజీలు : 212, ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్.

అనుబంధాన్ని పెంచుకున్న పాతతరం మధ్య వైరుధ్యాల్ని చక్కగా వివరించారు. రాత్రిళ్లు కావలికాసి దొంగల బెడద నుండి కాపాడే గుర్ఖాపట్ల మనం ప్రవర్తించే తీరును వేలెత్తి చూపుతూ. వారూ మనుషులే అంటూ మనస్సును తాకే విధంగా 'పారాహుషార్' కథ మలుపు పాఠకుడ్ని ఆకట్టుకుంటుంది. వ్యవసాయం దండగని భావించి తండ్రికి తెలియకుండా అప్పుచేసి షేర్‌మార్కెట్ మాయాజాలానికి బలైపోయిన శంకరానికి చివరకి మిగిలిందేమిటో 'నాగేటి చాలు' కథ చెబుతుంది. రైతుల వ్యథలు, బాధలే కాదు .... మధ్య తరగతి జీవితాల్లో నిత్యం జరిగే సంఘటనలూ ఈ కథల్లో కనిపిస్తాయి. 'పెళ్లి షరతు' కథలో నేటి తరం వివాహాల్లో వచ్చిన మార్పును కథగా మలిచారు. నేడు వ్యవసాయం చేసుకునే అబ్బాయిల పెళ్లికి తల్లిదండ్రులు ఎన్ని అగచాట్లు పడుతున్నారు. తను చేసుకోబోయే భర్త గురించి అమ్మాయిల ఆలోచనలు, ఆశలు ఏ విధంగా ఉన్నాయన్నది ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు. స్త్రీ, పురుష అసమానతలు పోగొట్టే విధంగా...ఏం ఆడపిల్ల అయితే తలకొరివి పెట్టకూడదా అంటూ పితృస్వామ్య భావజాలాన్ని పటాపంచలు చేసేవిధంగా 'ఆడపిల్ల అయితేనేం...' కథ వుంటుంది. ఈ కథాసంపుటిలోని అన్ని కథల్లో మనసున్న మనుషులు కనబడతారు. వారిని పీల్చి పిప్పిచేసే రాతి గుండె మనుషులూ కనబడతారు. మరో వైపు లోపభూయిష్టమైన వ్యవస్థ కనబడతుంది. అది సామాన్యుల్ని చేసే దోపిడీ కనబడుతుంది. రచయిత వ్యవస్థ తీరుతెన్నులను, సామాజిక సమస్యలను పాఠకుడికి అత్యంత సామాన్యంగా తెలియచేసే దిశగా ఈ కథలన్నింటినీ మలిచాడనిపిస్తోంది.

-గస్తీ

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ రచనలకు ఆహ్వానం పలుకుతోంది. కథకులే కాదు! రచనల పట్ల ఆసక్తి వున్న, శక్తి వున్న వారెవరైనా మీ కలాలను కదిలించి రకరకాల అంశాలను పంపవచ్చు. మీ సమీప ప్రాంతాలలో నెలకొన్న దర్శనీయ స్థలాలు, మీరు చూసొచ్చిన పర్యాటక ప్రదేశాల గురించి రాయవచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రికార్డులు సృష్టించిన, అవార్డులు పొందిన కళాకారులు, క్రీడాకారులు, చిత్రకారులు, సినీరంగానికి చెందినవారి గురించీ రాసి పంపవచ్చు. మట్టిలో మాణిక్యాల్లా స్వశక్తితో విజయాలు సాధించినవారి గురించీ పంపవచ్చు. ఒకవేళ అవేవీ రాయలేకపోయినా సలహాలు, సూచనలు ఇచ్చినా సంతోషమే. వారికీ ఆహ్వానం. స్నేహ పత్రికలో ఇప్పుడు వస్తున్న అంశాలు కాకుండా ఇంకా సమయానుకూలంగా ఇదిగో ఇవి వస్తే బాగుంటాయి. అని మీకనిపిస్తే మాకు తెలియచేయండి. రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.

-ఎడిటర్.

రచనలను పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1,
ఆజమాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

హ్యాపీ న్యూఇయర్

ఇంగ్లండ్‌లో కొత్త సంవత్సరం రాకను సూచిస్తూ గంటలు కొట్టే గడియారాలకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అర్ధరాత్రి బిగ్‌బెన్‌లో మోగే గంటల శబ్దం కోసం, నూతన సంవత్సర ప్రకటనను వినడం కోసం ఎంతో ఉత్సుకతతో ఎదురు చూడడం పరిపాటి. వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్ దగ్గర క్లాక్ టవర్ ప్రాంతమంతా జనంతో నిండిపోతుంది. లండన్‌లో జరిగే కొత్త సంవత్సర వేడుకలను, ప్రత్యేక కార్యక్రమాలను బిబిసి ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. 1984వ సంవత్సరం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. లండన్‌లో ట్రఫాల్గర్ స్క్వేర్ దగ్గరకు జనం పెద్ద ఎత్తున చేరతారు. థేమ్స్ నది ఒడ్డున భారీగా టపాసులు పేలుస్తారు. జెయింట్ వీల్స్, గుండ్రటి కార్లు ప్రత్యేక ఆకర్షణ. ◆

కన్యాశుల్కం - గురజాడ

తెలుగు సాహిత్యంలో సాటిలేని రచన. అగ్రవర్ణ చాందసంపైన అగ్నికురిపించి అభాగ్య బాల వితంతువుల కోసం ఎలుగెత్తిన నాటకం. కపటం నిండిన గిరీశాలను గురించి జాతిని ఆనాడే హెచ్చరించిన అపురూప సృష్టి.



మహా ప్రస్థానం - శ్రీశ్రీ

తెలుగు జాతిని నాటికీ నేటికీ కదం తొక్కించే మహత్తర ప్రజా కవిత్వం. తెలుగు భాషకు కొత్త వూపునూ రూపునూ అందించిన అభినవ మహాభారతం. శ్రమైక జీవన సౌందర్య సంకేతం.

గబ్బిలం - జాషువా

తరతరాల అణగారిన జాతుల ఆవేదనకు అక్షర రూపం. అపురూప భావ పద చిత్రాలతో వర్ణ వ్యవస్థను ప్రశ్నించిన సాహసం. మేఘసందేశానికి ప్రత్యామ్నాయమైన గబ్బిలం సందేశం.

అమృతం కురిసిన రాత్రి - బాల గంగాధర తిలక్

అభ్యుదయ కవిత్వ యుగంలో విలక్షణ విభిన్న స్వరం. జీవన సౌందర్యాన్ని భావనా సౌకుమార్యాన్ని మేళవించిన సృజనశీలత.

మట్టి మనిషి - వాసిరెడ్డి సీతాదేవి

భూస్వామ్య యుగపు కాయకష్టం నుంచి పెట్టుబడిదారీ వన్నెచిన్నెల్లోకి ప్రయాణం. తరాల మధ్య అంతరాలను చాటిన అక్షర రూపకం.

మాలపల్లి - ఉన్నవ లక్ష్మీనారాయణ

దళిత జాతుల ఘోషకు ఆర్ద్ర ఆవేదనా రూపం. పరాయిపాలనలో ప్రజ్వరిల్లిన స్వాతంత్ర కాంక్ష. సామ్యవాద తొలి సవ్వడి.

రధచక్రాలు - మహీధర రామ్మోహనరావు

తెలుగు నాట ప్రజా ఉద్యమ రాజకీయాల పరిణామ రూపం. పల్లెసీమల్లో రాజకీయ సామాజిక వైరుధ్యాల ఆవిష్కరణ. కొత్త తరం ధిక్కారం, ఆదర్శ స్వరం.

ప్రజల మనిషి - వట్టికోట ఆళ్వారుస్వామి

నిజాం వ్యతిరేక సాయుధ పోరాటపు తొలి ఘట్టం. పాటమరిస్తున్న చైతన్యం, పొలి కేక పెడుతున్న యువతరం ఉద్వేగమే ఈ రచన.

చిల్లర దేవుళ్లు - దాశరథి రంగాచార్య

ప్రజా పోరాటానికి ప్రజల భాషలో సజీవ దృశ్య కావ్యం. దొరలు గడీలు ఆడబాపలు వెట్టిబానిసల హృదయ ఘోష.

బారిష్టరు పార్వతీశం - మొక్కపాటి నరసింహారావు

చెరగని హాస్యపు చిరునామా. ఆధునిక జీవితపు గజిబిజిలో అమాయకుని అవస్థ. విదేశీ సంపర్కంలో వింత అనుభవాలు.

విమర్శా శిల్పం- వల్లంపాటి వెంకట సుబ్బయ్య

సాహిత్య రచనకూ ఆస్వాదనకూ ప్రామాణికమైన విమర్శనా దర్శిని. ఉదాహరణలతో పోలికలతో అవగాహన పెంచే అరుదైన రచన.

స్వీయ చరిత్రము- కందుకూరి వీరేశలింగం

తెలుగు జాతి వైతాళికుని జీవిత గమనం. అన్యాయాన్ని అంధ విశ్వాసాలను అడుగడుగునా ప్రతిఘటించిన సాహసి అనుభవాలు. మహిళా బాంధవుని జ్ఞాపకాలు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర- సురవరం ప్రతాపరెడ్డి

ప్రజల కోణంలో చరిత్ర రచనకు కొత్త వరవడి. సమాజాన్ని సామాన్యులనూ పట్టిచూపిన దిక్సూచి.

మాభూమి సుంకర, వాసిరెడ్డి

సాటిలేని సమరశీల నాటకం. తెలంగాణ పోరాటానికి సజీవ చిత్రణ. ప్రజలను వుగ్రూత లూపి పాలకుల నిషేదానికి గురైన ప్రజా నాటకం.

చివరకు మిగిలేది - బుచ్చిబాబు

సౌందర్య దృష్టి ప్రధానమైన తాత్వికాన్వేషణ. అమ్మ గురుతుకూ అనురాగమయ స్పర్శకూ అసూయా ద్వేషాలకూ మధ్య అలమటించిన ఒక మనిషి అనుభవ సంపుటి.

మైదానం - చలం



తెలుగు సాహిత్యంలో తొలి సంచలనం. మహిళలూ మనుషేలనన్న మేల్కొలుపు. ఒక సార్వత్రిక ధిక్కార నవల.

వీర తెలంగాణా విప్లవ పోరాటం - గుణపాఠాలు - పుచ్చలపల్లి సుందరయ్య

ఒక మహత్తర పోరాటానికి సాధికార సమగ్ర చరిత్ర. ఆధారాలు అంకెలు వాస్తవాలు సమర శీల అధ్యాయాలను కళ్లకు కట్టే అపురూప గ్రంథం.

అసమర్థుని జీవనయాత్ర - గోపీచంద్

సుపరిచితమైన సుప్రసిద్ధ నవల. అసమర్థత మూలాలు చెప్పే మనో విశ్లేషణ. మనసులు పట్టి చూపిన సృజన.

ఈ పుస్తకాలు దొరుకు చోటు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

బండారు అచ్చమాంబ కథలు

ఆలస్యంగా వెలుగు చూసిన ఆధునిక తెలుగు కథారంభకురాలు. ఆనాడే అతి నిశితంగా ఆలోచించి అందించిన అపురూప కథలు.



బుడుగు - ముళ్లపూడి వెంకట రమణ

తెలుగింటి పిల్లల అల్లరికి మచ్చు తునక. పెద్దలను ముప్పు తిప్పలు పెట్టే బాలజ్ఞానం. బాల్యానుభాలను తట్టి లేపే మధురాక్షరి.



కుటుంబరావు కథలు

సంస్కారానికి సామాజిక అవగాహనకు నిర్వచనమైన మేటి కథకుడి రచనలు. ప్రతి వాక్యంలో పొదిగిన జీవితం, ఒదిగిన అనుభవం.

పుణ్యభూమీ కళ్లుతెరు- బీనాదేవి

ధనశక్తుల విషకోరలలో నలిగే అసంఖ్యాక అసహాయ జీవుల ఆక్రందన.. న్యాయ వ్యవస్థ కోరల్లో అధికార యంత్రాంగం ఉక్కుపాదాల కింద మూలుగు..

చాసో కథలు

ఒక ప్రబుద్ధ మేధ పరిణత రచనలు. జీవితం సిద్ధాంతం మానవానుభవాల అపురూప సమ్మేళనం.

సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యానికి దారి దీపం. సూక్ష్మంలో మోక్షంలా వందల ఏళ్లను సందర్శింపచేసే అరుదైన సంపుటాలు.

సారస్వతావలోకనం- రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

పాత సాహిత్యం పట్ల కొత్తచూపు. రాయలనాటి రసికతనూ కరిగిపోయిన రసజ్ఞతనూ ఆవిష్కరించే అక్షరాంజలి.



వేట కుక్కలు- పతంజలి

నిప్పులు కక్కే వ్యంగ్య వైభవం. నిలదీసి చదివించే నిష్టుర నిజాల నిలదీత. మధ్యతరగతిని పట్టి కుదిపేసే పసిడి పలుకులు ఈ రచన ప్రత్యేకత.

రత్తాలు-రాంబాబు - రావిశాస్త్రి

ఆధునికత చాటున పిరికితనాన్ని మురికితనాన్ని కడిగిపారేసే ఆక్షేపణ. అనితర సాధ్యమైన పోలికలూ.. ఆశ్చర్యం నింపే వాస్తవికత

పెన్నేటి పాట- విద్వాన్ విశ్వం

రాయలసీమ దురవస్థకు దర్పణం. అలతి అలతి పదాలతో గంభీర సందేశం. వ్యధార్థ జీవన గీత.

పాకుడు రాళ్లు - రావూరి భరద్వాజ

వెండితెర వెనక వేదనలను వెల్లడించిన నవీన మహాకావ్యం.జ్ఞానపీఠం వరకూ పయనించిన ప్రసిద్ధ గ్రంథం.

నా గొడవ - కాళోజీ

ఏ పటాటోపాలు లేని శుద్ధ ప్రజా కవిత్వం. ఆరు దశాబ్దాల పరిణామ క్రమంపై ఒక నిబద్ధ నిరాడంబర జీవి అక్షర స్పందన. తెలంగాణ గుండె చప్పుడు ఈ రచన.